



# వార్తాప్రభ


RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States









సంపుటి : 24 | సంచిక : 29 | ది. 27-3-2025 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# కోపం వస్తున్నా, నియంత్రించుకుంటున్నాం

- కొందరు పోలీసుల శైలితో ఆ వ్యవస్థపైనే అపనమ్మకం
- వ్యంగ్య విమర్శలకే అరెస్ట్ చేసే పనైతే సినిమా వాళ్లను అరెస్ట్ చేయాలి
- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు




**అమరావతి,మార్చి 26 (వార్తాప్రభ) :** కేసుల నమోదు విషయంలో కొందరు పోలీసుల తీరుపై హైకోర్టు మండిపడింది. కొందరు పోలీసుల వ్యవహార శైలితో ఆ వ్యవస్థను నమ్మే పరిస్థితి లేకుండా పోతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరిన్ని తప్పులు చేస్తున్నారని పేర్కొంది. పోలీసుల తీరుపై ఆగ్రహం కలుగుతున్నా నియంత్రించుకుంటున్నామంది. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలను నాటకీయంగా, వ్యంగ్యంగా విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిని అరెస్ట్ చేసే పనైతే.. అలాంటివి చేసిన ప్రతి సినిమా హీరో, విలన్‌నూ అరెస్టు చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. జడ్జీలు కోర్టు హాల్లోనే ఉంటారు.. వీధుల్లో జరిగేది వారికేం తెలుసులే అనుకోవద్దని పోలీసులను హెచ్చరించింది. వ్యంగ్య పోస్టులు పెట్టిన ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తిని బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారనే (ఎక్స్టార్షన్) సెక్షన్ చేర్చిన కర్నూలు మూడో పట్టణ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సెక్షన్ చేర్చి హాజరుపరిస్తే నిందితుణ్ని మేజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పేర్కొంది. ఫిర్యాదు అందిన వెంటనే కర్నూలు నుంచి వచ్చి గుంటూరులో ఉన్న ప్రేమ్‌కుమార్‌ను తెల్లవారుజామున అదుపులోకి తీసుకోవడంపై కర్నూలు మూడో పట్టణ సీఐని నిలదీసింది. అవసరమైతే ఈ కేసు దర్యాప్తు బాధ్యతల నుంచి సీఐని తొలగించి మరొకరికి అప్పగిస్తామని తేల్చిచెప్పింది. కేసు రికార్డులను తమ ముందుంచాలని సీఐ, సంబంధిత మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. తాజా వివరాలతో కౌంటర్ వేయాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ కె.మన్మథరావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

**ఇంత మెరుపువేగంతో ఎన్ని కేసులు పరిష్కరించారు?**

గుంటూరుకు చెందిన వైకాపా నేత కొరిటిపాటి ప్రేమ్‌కుమార్.. 'గుంతలు పూడ్చాలంటే.. ఊరూరా టోల్‌గేట్ కట్టాల్సిందే' అంటూ వాహనదారుల నుంచి కూటమి ప్రభుత్వం డబ్బు వసూలు చేస్తున్నట్లు ఓ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై కర్నూలు ఐటీడీపీ అధ్యక్షుడు తిలక్ ఫిర్యాదుతో పోలీసులు ప్రేమ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ప్రేమ్‌కుమార్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ ఆయన కుమారుడు అభినవ్ వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ఇటీవల హైకోర్టు విచారణ జరిపింది. ధర్మాసనం ఆదేశాలతో కర్నూలు మూడో పట్టణ సీఐ మంగళవారం సీఐ కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో స్పందించినంత వేగంగా మిగతా కేసుల్లోనూ వ్యవహరిస్తున్నారా? ఇప్పటి వరకు ఎన్ని కేసులను ఇలా మెరుపు వేగంతో విచారించారో పరిశీలిస్తామని సీఐని కోర్టు నిలదీసింది.

# రాష్ట్రాభివృద్ధికి పర్యాటకం ఒక గేమ్ ఛేంజర్

- ఇందులో 20 శాతం వృద్ధిరేటు సాధించాలి
- రాజమండ్రిలో 5 వేల గదులు లభ్యత ఉండేలా హెూటళ్ల నిర్మాణం చేపట్టాలి
- పామాయిల్ రంగంలో దేశంలో ఏపీనే నెంబర్ వన్
- ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి
- గోదావరి పుష్కరాలకు సన్నాహక చర్యలు చేపట్టండి
- ప్రత్యేకాధికారులుగా వీరపాండ్యన్, విజయరామరాజు
- అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం




**అమరావతి,మార్చి 26 (వార్తాప్రభ) :** రాష్ట్రాభివృద్ధికి పర్యాటక రంగం గేమ్ ఛేంజర్ కాబోతోందని, అన్ని జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన గోదావరి జిల్లాలపై కలెక్టర్లు ఇచ్చిన ప్రజంటేషన్‌లపైన స్పందిస్తూ మాట్లాడారు. పర్యాటక రంగం వృద్ధి రేటు పెంపొందించుకోవడానికి గ్రోత్ ఇంజిన్‌లా పనిచేస్తుందని, అధికారులు ఈ రంగంలో ఏపీ అవకాశాలను అందిపుచ్చుకునేలా పనిచేయాలన్నారు. కనీసం ఈ రంగంలో 20 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని, అక్కడ సుందర ప్రదేశాలు, ఆలయాలు సందర్శించేలా దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేలా జిల్లాలో ప్రణాళికలు రూపొందించి పనిచేయాలన్నారు. పర్యాటకులు రావడమే కాదు, వారికి తగిన సదుపాయాలు కూడా అక్కడ కల్పించాలన్నారు. రాజమండ్రిలో 5వేల గదులు లభ్యత కలిగేలా హెూటళ్ల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కేవలం రాజమండ్రి మాత్రమే కాకుండా విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతి, అనంతపురంలో ఒక్కో ప్రాంతంలో 5వేల గదులు లభ్యత ఉండేలా హెూటళ్ల నిర్మాణానికి కలెక్టర్లు ప్రోత్సాహం అందించాలన్నారు.

**గోదావరి పుష్కరాలకు సన్నాహాలు..** గోదావరి పుష్కరాలకు సన్నాహక చర్యలు మొదలు పెట్టాలని సీఎం అధికారులకు ఆదేశించారు. దీనికోసం వెంటనే ఇద్దరు ప్రత్యేకాధికారులను నియమిస్తున్నామన్నారు. ఐఏస్ అధికారులు వీరపాండ్యన్‌ను ప్రత్యేకాధికారిగా, విజయరామ రాజును అధనపు అధికారిగా నియమిస్తున్న సీఎం తెలిపారు.

**పామాయిల్ సాగులో ప్రగతి సాధించాలి..** దేశంలో పామాయిల్ సాగులో మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ ఒన్‌గా ఉందన్నారు. దేశంలో 60 శాతం పామాయిల్ సాగు మన రాష్ట్రంలోనే జరుగుతోందన్నారు. మరింత ఎక్కువగా రైతులు పామాయిల్ సాగువైపు ప్రోత్సహించాలన్నారు. జాతీయ రహదారుల వెంబడి కూడా ఖాళీ స్థలల్లో పామాయిల్ చెట్లు పెంచే అవకాశాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిశీలించాలన్నారు. తద్వారా రహదారులవెంబడి పచ్చదనం పెంచడమే కాకుండా రహదారులు శోభాయమానంగా కనిపిస్తాయన్నారు.

**కడియం నర్సరీలో నరేగా పనులు..** కడియం నర్సరీలో నరేగా పథకం కింద పనులు చేయాలని దీనికి సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ఆక్వారంగం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆక్వా వ్యర్థాలు వృథాగా పోకుండా వాటి ద్వారా ప్రొటీన్ ఉత్పత్తులు తయారచేసే పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

**డెల్టాలో మూడు పంటలు..** కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో రైతులు మూడు పంటలు సాగు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దానికున్న సాధ్యసాధ్యాలను అంచనా వేసి రైతులు మూడు పంటలు పండించేలా ప్రోత్సహించాలన్నారు. వరి తర్వాత రెండు డ్రై క్రాప్స్ పండిచడానికి వీలు కల్పించాలన్నారు.

**గోదావరి జిల్లాలు పురోగమించాలి..** గోదావరి జిల్లాలు పురోగమిస్తూ ప్రగతిపథంలో ముందుకెళ్లాలని, ఆ దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనసీమ జిల్లా తలసరి ఆదాయం తక్కువగా ఉందని కారణాలు ఏంటీ అనేది అధికారులు విశ్లేషించుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలు పురోగతిలో ముందుండేవి ఇప్పుడు కాస్తంత వెనుకబడుతున్నాయని, ఇది మంచిది కాదని ఈ జిల్లాల అధికారులు వెంటనే దీనిపై దృష్టి సారించాలన్నారు. మెట్ట ప్రాంతమైన ఏలూరు తలసరి ఆదాయంలో ముందుంటే సారవంతమైన భూములున్న కోనసీమ జిల్లా వెనుకబడిపోవడం సరికాదని దీనిపైన అధికారులు కృషి చేయాలన్నారు. తమ తమ జిల్లాల్లో వృద్ధి రేటు పెంపొందించుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

# ధరణి ఓ దుర్మార్గమైన చట్టం.. అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్,మార్చి 26 (వార్తాప్రభ) :** సభలో ధరణి , భూభారతి పై బీఆర్ఎస్ కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ భూములపై హక్కులు కల్పిస్తూ వస్తోందని అన్నారు. దున్నే వాడిదే భూమి కదా.. సాయుధ పోరాట నినాదమని విపక్ష సభ్యులను ప్రశ్నించారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టమే ధరణి అంటూ మండిపడ్డారు. అందుకే ధరణిని బంగాళాఖాతం లో వేస్తామని చెప్పామని అన్నారు. అనేక చట్టాలు, పోరాటాల ద్వారా వచ్చిన హక్కులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని కామెంట్ చేశారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలు మాకు అధికారాన్ని కట్టబెట్టారని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు.

# ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్

- ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ అంటూ ఉర్దూలో రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు



**విజయవాడ, మార్చి 26 (వార్తాప్రభ) :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విజయవాడ ఎన్ఏసీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ అంటూ ఉర్దూలో ముందస్తు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అందరి ప్రార్ధనలు సఫలం కావాలని ఆకాంక్షించారు. అల్లాహ్ చల్లని ఆశీస్సులతో అందరూ బాగుండాలని ఆయన కోరుకున్నారు.

**టోపీ, కండువా ధరించి నమాజ్..** ఇక ముస్లిం సంప్రదాయం ప్రకారం టోపీ, పవిత్ర కండువా ధరించిన వైయస్ జగన్ ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు. అనంతరం వారితో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో పాటు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు



# దేశంలో జమిలి పక్కా.. బిజెపి స్కెచ్ అదే!




**న్యూఢిల్లీ,మార్చి 26 (వార్తాప్రభ) :** దేశంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది భారతీయ జనతా పార్టీ 2014, 2019, 2024 ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టింది. అటు చాలా రాష్ట్రాల్లో సైతం రాగలిగింది. ఇంకొన్ని రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారాన్ని పంచుకుంటుంది. ఎలా చూసినా బిజెపి బలమైన శక్తిగా ఉంది. అందుకే ఈ శక్తిని పదిల పరుచుకునేందుకు బిజెపి సరికొత్త ప్రయోగం 'జమిలి' వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మాట చాలా రోజులుగా వినిపిస్తోంది. తెర వెనుక కార్యాచరణ జరుగుతోంది. అయితే తాజా పరిస్థితులను చూస్తుంటే మాత్రం బిజెపి జమిలి వైపేనని తేలిపోతోంది.

**సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో..** మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి కి ఆశించిన ఫలితాలు రాలేదు. బిజెపి సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ దాటుతుందని అంతా అంచనా వేశారు. కానీ జనాలు అవకాశం ఇవ్వలేదు. మ్యాజిక్ ఫిగర్ కు 40 సీట్లు దూరంగా బిజెపి ఉండిపో యింది. అటువంటి సమయంలోనే తెలుగుదేశం పార్టీతో పాటు నితీష్ పార్టీ అండగా నిలిచింది. అప్పుడే జమిలీ ఎన్నికల ఆలోచనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జమ్మూ కాశ్మీర్ తో పాటు ఝూర?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురయ్యేసరికి జమిలి అంశం పక్కన పెట్టింది బిజెపి.

**ఆ రెండు రాష్ట్రాల విజయంతో...** అయితే తర్వాత మహారాష్ట్ర 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రావడంతో జమిలిపై కదలిక వచ్చింది. వచ్చే ఎన్నికల్లో కూడా సత్తా చాటాలని బిజెపి భావిస్తోంది. తద్వారా కాంగ్రెస్ పార్టీకి ఉన్న రికార్డులను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇప్పుడు బిజెపి పరిస్థితి బాగుంది. ఆ పార్టీపై పాజిటివ్ ప్రచారం ఉంది. అందుకే ఇటువంటి సమయంలో జమిలి ఎన్నికల ద్వారా అనుకున్నది సాధించాలని చూస్తోంది. ఇప్పటికే జమిలి బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. ఆరు నెలల పాటు అధ్యయనం కూడా ముగిసింది. బిజెపి పాలిత రాష్ట్రాలే ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో బలమైన మిత్రపక్షాలు కూడా కొనసాగుతున్నాయి. అందుకే జమిలీపై ఏకాభిప్రాయానికి వచ్చి.. ముందస్తు ఎన్నికలకు సిద్ధపడుతోంది బీజేపీ. మరి కాషాయ దళం ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

**భాగస్వామ్య పక్షాలు సైతం..** ప్రస్తుతం కేంద్రంలో పాలుపంచుకుంటున్న కీలక నేత చంద్రబాబు సైతం జమిలి కి జై కొట్టారు. అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగితే ఖర్చు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. ఇది దేశానికి అవసరం కూడా అన్నారు. మరోవైపు బీహార్ లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడ ఎన్డిఏ భాగస్వామ్య పక్షం అధికారంలో ఉంది. ఆ అసెంబ్లీ ఎన్నికలతో పాటు జమిలి జరిగితే తప్పకుండా సీఎం నితీష్ కుమార్ ఆహ్వానిస్తారు. అయితే ఈ విషయంలో పక్కా ఆలోచనతో అడుగులు వేస్తోంది భారతీయ జనతా పార్టీ. జమిలి ద్వారా సరికొత్త రికార్డులను క్రియేట్ చేయాలని చూస్తోంది.


**మహారాజశ్రీ గుడివాడ 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో**

MVOP NO : 20/2023

Between

అన్నపురెడ్డి గణేష్
-----పిటిషనరు

AND

తోట త్రిమూర్తులు మరియు ఇరువురు
----- రెస్పాండెంట్లు

To.
R.1 తోట త్రిమూర్తులు,
S/o వీరరాఘవులు,
హిందువు, AP 27 TU 5555 బస్సు డ్రైవరు, R/o D.No. 2-3-144,
ఈదరపల్లి, అమలాపురం,
కోనసీమ జిల్లా

పై నంబరు కేసులో రెస్పాండెంట్ నంబరు 1 అయిన మీకు పలుమార్లు నోటీసులు పంపినను మీరు అందుకొనుట లేదు. కావున ఈ ప్రకటన ద్వారా తెలియజేయు చున్నాము. కావున మీరు ఈ కేసులో ది 16-4-2025 నాడు ఉదయం 10.30 ని॥లకు పైన తెలిపిన కోర్టులో స్వయముగా కాని లేదా ప్లీడరు గారితో గాని హజరు అవ్వాలి. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//శ్రీ కోర్టు వారి అర్డరు ప్రకారం//

ఇట్లు
శ్రీమతి G.R. కమలామృతం
శ్రీ K.V. ప్రకాష్
అడ్వకేట్లు, గుడివాడ



**మహారాజశ్రీ విజయవాడ 1 వ అదనపు సివిల్ జడ్జి వారి కోర్టు లో (సీనియర్ డివిజన్)**

E.P.NO.51/2024 In OS. NO. 55/2023

Between:

పుష్పాల విఘ్నేశ్వర రావు
------డిక్రీ హెూల్డర్/వాది

మరియు

పుష్పాల వెంకటేశ్వర రావు
------జడ్జ్మెంట్ డెటార్ / ప్రతివాది

To.
పుష్పాల వెంకటేశ్వరరావు, తండ్రి : చంద్ర శేఖర రావు, వయస్సు 60 సం.లు, నివాసం: డోర్ నెం. 74-32/1-28, కానూరు, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా.

పై నెం దావాలోని జడ్జ్మెంట్ డెటార్ / ప్రతివాది పై డిక్రీ హూల్డర్ / వాది, డిక్రీ అమలు చేయు నిమిత్తం, దావాలో attachment before judgment in I.A. No. 893/2023 లో తెలిపిన ఆస్తిని వేలం వేయు నిమిత్తం పై E.P. NO. 51/2024ను దాఖలు చేయగా, పై తెలిపిన జడ్జ్మెంట్ డెటార్ / ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు నోటిస్ లు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ నోటిస్ ద్వారా పై జడ్జ్మెంట్ డెటార్ / ప్రతివాది హాజరు నిమిత్తం ది: 16.04.2025 ఉదయం గం. 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలయును. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము //
వాయిదా తేదీ: 16.04.2025

Ch. Srinivasa Rao,
Advocate for DHR, Cell No. 9700521516

విజయవాడ
25.03.2025.


# భూభారతి కాన్సెప్ట్‌తో ఎన్నికలకు వెళ్తాం


- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్,మార్చి 26 (వార్తాప్రభ) :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం సభలో ధరణి , భూభారతి పై చర్చ ఆసక్తికరంగా కొనసాగింది. అధికార, విపక్ష నేతల పరస్పర ఆరోపణలతో సభ దద్దరిల్లింది. ఈ క్రమంలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ధరణి' బాగుందో..లేదో అన్న విషయంపై ఇప్పటికే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పూర్తి స్పష్టత వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ధరణిని అజెండాగా తీసుకుని ముందుకు వెళ్తానే భూభారతి కాన్సెప్ట్‌తో ప్రజల్లోకి వెళ్తామని స్పష్టం చేశారు. ధరణిలో జరిగిన అక్రమాలు, అన్యాయాలను పల్లా రాజేశ్వర్ రెడ్డి కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత సర్కార్ ఎలా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసని, కొత్తగా వాళ్ల భవిష్యత్తు, అభ్యున్నతిపై బీఆర్ఎస్ పార్టీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వీఆర్ఏలు కావాలని ప్రజలే అడుగుతున్నారని, ఆ వ్యవస్థను మళ్లీ త్వరలోనే తీసుకురాబోతున్నామని తెలిపారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వీఆర్ఏ, వీఆర్వోలకు ప్రత్యేక గౌరవం ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

# శాసనసభలో వీధి పోరాటామా!

- సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్,మార్చి 26 (వార్తాప్రభ) :** శాసనసభ జరుగుతున్న తీరు చాలా దురదృష్టకరమని, సభలో అధికార, ప్రతిపక్ష సభ్యులు వీధి పోరాటాన్ని తలపించేలా వ్యక్తిగతంగా పరస్పరం దూషించుకునే విధంగా మాట్లాడం సరికాదని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందుకు బయట రాజకీయ వేదికగా చాలా ఉంటాయని, అక్కడమేమైనా మాట్లాడుకోవచ్చు.. కాని ఇక్కడ సభ సమయం వృదా చేయడం సరైంది కాదని సూచించారు. సభలోప్రజా సమస్యలపై చర్చి జరిగి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, నాలుగున్నర కోట్ల ఎదురు చూస్తుంటారని కాని దురదృష్టమేమిటంటే ఓ స్థాయి లో ఉన్న మనం ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఎంత కోపం, ఆవేశం ఉన్నా పరిధిలో దాటి మాట్లాడ కూడదని, పార్లమెంటరీ, అసెంబ్లీ సంప్రదాయాలు ఉంటాయని గుర్తు ఉంచుకోవాలన్నారు. అద్దాల మేడలో కూర్చుకోని దానిపై రాయి మనమే విసురుకుంటే అది పగులుతుందని, అధికార పక్షమైనా & ప్రతిపక్షమైనా & ఎవరైనా వ్యక్తిగతంగా పరస్పరం దూషించడం సరికాదన్నారు. రాజకీయాలు బయట మాట్లాడుకుందామని, సభ సమయాన్ని వృదా చేయరాదని, రెండు పక్షాలశ్రేయోభిలాషిగా కోరుతునన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి... చంద్రబాబు కీలక ఆదేశాలు

**అమరావతి,మార్చి 26 (వార్తాప్రభ) :** రాజమండ్రి శివారులో పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై వస్తున్న ఆరోపణలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో మాట్లాడిన సీఎం పాస్టర్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్రం హెూం మంత్రి అనిత తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ కు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాలని ఆదేశించారు. రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ మాట్లాడుతూ రాజమండ్రి శివారు కొంతమూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని... ఈ ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మరణించాడని చెప్పారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ పై బయల్దేరిన ప్రవీణ్... అర్ధరాత్రి సమయంలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. రహదారి పైనుంచి ప్రమాదవశాత్తు

- 2లో

# కాషాయ రంగులో మెరిసిన "కోమళ్ల"!!

- తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తా
- బిజెపి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తా
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతా
- పెద్దపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**గత 20 సంవత్సరాలకు పైగా కాషాయ జెండా మోసి, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, విద్యార్థి ఉద్యమాలలో ఎన్నోసార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చిన కోమళ్ల మహేష్ కుమార్ సేవలను భారతీయ జనతా పార్టీ అధిష్టానం గుర్తించినది. ఈ మేరకు మంగళవారం కోమళ్ల మహేష్ కుమార్ ని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి. ఎంపిక కావడం పట్ల మహేష్ ఆనందం వ్యక్తం చేస్తూ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బిజెపి ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తాను అని తెలిపారు. బిజెపి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతా అని అన్నారు. తన నియమకానికి కృషి చేసిన అందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# పోచమ్మ గుడిలో దోపిడి!!

- లెక్క పత్రం లేకుండా భక్తులకు శఠగోపం
- 50, 100, 200రూలకు తగ్గేది లేదు
- బోనం, చీర సారె, కోడి మేకల బలి సుంకానికి బలవుతున్న భక్తజనం
- గుడి పైసలు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయి
- "విటమిన్ ఎం"తోనే తతంగం పూరా మేనేజటా
- దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని భక్తుల డిమాండ్








**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** గోదావరిఖనిలో అత్యంత విశిష్టత, ప్రాముఖ్యత కలిగిన పోచమ్మ గుడిలో ఆర్థిక దోపిడీ రోజురోజుకు పెరిగిపోతున్నది. లెక్క పత్రం లేకుండా భక్తులకు శఠగోపం పెడుతున్నారు ఆలయ నిర్వాహకులు. 50, 100, 200రూలకు తగ్గేది లేదు అంటూ భక్తులపై, ముక్కు చెల్లించే వారిపై హుకుం జారీ చేస్తున్నారు. బోనం, చీర సారె, కోడి మేకల బలి డబ్బులకు బలవుతున్న భక్తజనం సోషల్ మీడియా వేదికగా, బహిరంగంగా, ఆలయ ప్రాంగణం వద్ద తమ తమ బాధను వ్యక్తపరుస్తున్నారు. గుడి పైసలు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయి అని ప్రశ్నిస్తున్నారు. పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకోవడానికి వస్తే జేబులు గుల్ల చేసుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత తథంగం ఏళ్ల తరబడిగా జరుగుతున్న సంబంధిత అధికారులుగానీ, ప్రజాప్రతినిధులు గాని నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎవరెవరిని ఎలా మేనేజ్ చేస్తున్నారో స్పష్టంగా అర్థం అవుతున్నదని తలడిల్లుతున్నారు. అడ్డు, అదుపు లేకుండా భక్తుల భక్తిని అడ్డం పెట్టుకుని దోపిడీ చేస్తున్న ఆలయ నిర్వహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దేవాదాయ శాఖ ఆధీనంలోకి ఆర్థిక దోపిని అరికట్టాలని భక్తజనుల డిమాండ్.

## ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం : మంత్రి కొండా సురేఖ




**కుత్బుల్లాపూర్ మార్చి 26 (వార్తాప్రభ)** : తెలంగాణ 2025-26 బడ్జెట్ సమావేశాల్లో భాగంగా కుత్బుల్లాపూర్ లో అటవీశాఖ అనుమతుల ఆలస్యంతో మందకోడిగా కొనసాగుతున్న "ఇన్నర్ రింగ్ రోడ్డు" పనులపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకా నంద్ బుధవారం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే లేవనెత్తిన సమస్యలపై మంత్రి కొండా సురేఖ సమాధానమిస్తూ అటవీ శాఖ నుండి త్వరతగతిన అనుమతులను ఇప్పించి ఇన్నర్ రింగ్ రోడ్ పనులను పూర్తి చేస్తామని అసెంబ్లీ వేదికగా తెలిపారు.

# ఆలకుంట సంపత్ "లాకప్ డెత్" పై ఎన్నో అనుమానాలు!!


- హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలి
- మృతుని కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వాలి
- బాధ్యులపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌర హక్కుల సంఘం డిమాండ్




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆలకుంట సంపత్ "లాకప్ డెత్" పై ఎన్నో అనుమానాలు ఉన్నాయి అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌర హక్కుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గాం ప్రాంతానికి చెందిన ఆలకుంట సంపత్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉపాధ్యక్షులు నార వినోద్, సభ్యులు బొంకూరి లక్ష్మణ్, రెడ్డి రాజుల సంపత్, బండారి రాజ లింగయ్య, ఎన్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మృతుని కుటుంబ సభ్యులను కలుసుకొని మీడియాతో మాట్లాడారు. ఇంటరాగేషన్ పేరిట చేపట్టిన థర్డ్ డిగ్రీ తట్టుకోలేకనే సంపత్ మరణించినట్లు కుటుంబ సభ్యులకు, తమకు అనుమానం ఉన్నదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. అతని మృతికి కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలి అని విధుల నుంచి డిస్మిస్ చేయాలి అని డిమాండ్ చేశారు.

# సమాజసేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు!!

- మూడవరోజు "రెస్ట్ లెస్"గా స్వచ్ఛత కార్యక్రమాలు
- నిస్వార్థమే లక్షణం సమాజసేవే లక్ష్యంగా ముందుకు
- విద్యార్థులకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత అవసరం
- డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కిరణ్మయి






**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**విద్యార్థులకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత అవసరం అని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపు సందర్భంగా మూడవ రోజు విటల్ నగర్ లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ...... ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపు సందర్భంగా మొదటి రోజు క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని రెండవ రోజున సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) అధికారులచే ఫైర్ ఫైట్ (ఆపత్కాల్), మూడోరోజు పచ్చదనం పరిశుభ్రత చేపట్టామని తెలిపారు. మిగిలిన నాలుగు రోజులు సమాజ సేవ, నాయకత్వ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, స్వచ్ఛత కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, పంటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ నిర్వహిస్తామని అన్నారు. స్పెషల్ క్యాంపు ద్వారా విద్యాసంస్థలకు సమీపంలోని గ్రామాలని దత్తత తీసుకొని ఆ గ్రామాల అభివృద్ధికి వారం రోజుల పాటు క్యాంపులు వేసి వివిధ కార్యక్రమాలని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ సాంబశివరావు, యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేష్, సీనియర్ అధ్యాపక బృందం డాక్టర్ సుబ్బారావు కార్యక్రమాల విజయానికి విశిష్ట కృషి చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

# అప్పుల కోసం కోటి పాట్లు

## అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే హరీశ్ బాబు



**హైదరాబాద్, మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు 10వ రోజు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర బడ్జెట్ పై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడును రోల్ మోడల్ గా తీసుకునే రాష్ట్ర ప్రభుత్వం.. వారు పాటించిన విధానాలను ఫాలో అవ్వడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఖర్చు కంటే బడ్జెట్ అంచనా 20 శాతం అధికంగా నిర్ణయించారని గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలానే చేసిందని గుర్తు చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఘన్ పూర్ సభలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యవస్థ కుదేలైంది అని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, రైతులకు గ్రామాల్లో అప్పులు ఇచ్చే పరిస్థితి లేదని ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. అలాగే ఇండ్ల అమ్మకాలు హైదరాబాద్ లో 40 శాతానికి పైగా పడిపోయాయని అన్నారు. రాష్ట్రంలో వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి రోజువారీ కూలీ దొరకడం లేదని, దీనికి రియల్ ఎస్టేట్ పడిపోవడం కారణం అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అప్పులే ప్రధాన ఆదాయంగా మారిపోయాయని.. వాటి వల్ల రాష్ట్రం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని, భవిష్యత్తులో ఈ పరిస్థితి దారుణంగా మారుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ గైడ్ లైన్ కంటే అధికంగా ఓవర్ డ్రా ద్వారా అప్పులను తీసుకుంటుంది.. ఈ అప్పులు కూడా సరిపోగా నగరంలో ఉన్న విలువైన భూములను అమ్మాలని చూస్తున్నారని ఇందులో భాగంగానే గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఆ 400 ఎకరాలు మహానగరానికి బ్రీతింగ్ స్పేస్.. అని, నగరం మొత్తం కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న క్రమంలో.. 400 ఎకరాల అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాలని.. అందులో వేలాది పక్షులు, నెమళ్ళు, జింకలు, ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ క్రమంలో గచ్చిబౌలి భూముల అమ్మకంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే సూచించారు. అయితే కూటి కోసం కోటి విద్యలు అన్నట్లు.. అప్పు కోసం కోటి విద్యలు అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి తయారైందని, రోజు వారి పాలన కోసం కూడా ప్రభుత్వం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు చెప్పుకొచ్చారు.

# శాంతి, సోదర భావంకు ప్రతీక రంజాన్ మాసం

## సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి"దవాత్ ఏ ఇఫ్తార్" లో పాల్గొన్న శాసనసభ్యులు గాంధీ



**శేరిలింగంపల్లి,మార్చి 26 (వార్తాప్రభ)**:రంజాన్ మాసం పర్వదినం ను పురస్కరించుకుని చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట లో సీనియర్ నాయకులు అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దవాత్-ఏ - ఇఫ్తార్ విందు కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని,రంజాన్ మాసం సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు,దెట్కవ ప్రార్థనలతో సామరస్యం,శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా అభినదించదగ్గ విషయం అని అదేవిధంగా తెలంగాణకు ప్రత్యేకమైన "గంగా జమునా తెహజీబ్" మరింతగా పరిఢవిల్లాలని,రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని పీఏసి చైర్మన్ గాంధీ అభిలషించారు.రంజాన్ మాసం ఉపవాసం తో మంచి తనం,సంస్కారం అలవడుతుందని ,మతసామరస్యానికి ప్రతీక,అందరూ కల్సి ఉండాలని,అదేవిధంగా కుల మతం జాతి భేదం లేకుండా తెలంగాణ జాతి అంతా ఒకటే అని,ఆ దేవుడి కరుణకటాక్షాలు పొందేందుకు దేవుడి కృపకు దగ్గర కాగలమనేది ప్రతి ముస్లిం సోదరుల ప్రగాఢ విశ్వాసము అందుకే ఎంతో భక్తి శ్రద్ధలతో రంజాన్ నెల మాసాన్ని పురస్కరించుకుని నియమ నిబంధనలు పాటించి ఉపవాస కఠోర దీక్షతో ప్రార్థనలు చేస్తారు. ఈ విధమైన ఆధ్యాత్మిక దైవ ప్రార్ధనలతో శాంతి,సోదరభావం, సౌభ్రాతృత్వానికి రంజాన్ ప్రతీక అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,ముస్లిం సోదరులు,మహిళ సోదరీమణులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

### డాక్టర్ ఎల్.అరుణ శుభాకాంక్షలు తెలిపినమజ్దూర్

## యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ నాయకులు ఖాజా బాబా



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**భద్రాద్రి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంబస్టాండ్ ఏరియాలోని డా: బసవయ్య కాంప్లెక్స్ లో స్కిన్ , హెయిర్ అండ్ లేజర్ సెంటర్ మదర్ అండ్ చిల్డ్ హాస్పిటల్ ను. డాక్టర్ ఎల్.అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మవ్యాధులు మరియు ఎయిర్ ఫాల్స్ సంబంధించిన ఆధునిక పరికరాలతో వైద్యం అందించటం జరుగుతుంది అన్నారు, చిన్నపిల్లల వైద్య నిపుణులు మరియు గైనిక్ ఐలి రిస్క్ డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు . అనంతరం మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ ప్రెసిడెంట్ ఎస్కే కాజా బాబా, ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో బి. పుల్లయ్య ఓం కుమార్ శంకర్ ఉదయ్ సైదులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో సత్ఫలితాలు!!

- 11వగని రికార్డ్ బ్రేక్ హర్షనీయం
- ప్రతి ఉద్యోగి కంపెనీ మనుగడ కోసం కష్టించాలి
- సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**సమిష్టి కృషితో సత్ఫలితాలు పొందవచ్చు అని సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం జీడికే లెవెన్ ఇంక్లైన్ గని బొగ్గు ఉత్పత్తిలో రికార్డు బ్రేక్ చేసిన నేపథ్యంలో సంబరాలు చేశారు. 65,100 టన్నుల బొగ్గు టార్గెట్ ఉండగా ఆరు రోజుల ముందుగానే 66,902 టన్నుల బొగ్గును డిస్పాచ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గని అధికారులు, ఉద్యోగులను లలిత్ కుమార్ అభినందించారు. ప్రతి ఉద్యోగి కంపెనీ మనుగడ కోసం కష్టించాలి అని తెలిపారు.

## ట్రూ హెల్పింగ్ హాండ్స్ సంస్థకు ప్రతిష్ఠాత్మక అవార్డు



**హైదరాబాద్, మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** సామాజిక సేవా కార్యక్రమాల్లో దూసుకెళ్తున్న ట్రూ హెల్పింగ్ హాండ్స్ కు ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కింది. రక్తదానం విద్య, వైద్యం అన్నదానం ధార్మిక రంగాల్లో సంస్థ చేస్తున్న కృషిని గుర్తించిన ఓకే టీవీ తెలుగు రత్న ఉత్తమ సేవా అవార్డును అందించింది. సంస్థ అధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్, ఉపాధ్యక్షులు గోగిక రోహిత్, ప్రధాన కార్యదర్శి మేకల కార్తిక యాదవ్, జాయింట్ సెక్రెటరీ బైకానీ శ్రీశైలం, ట్రెజరర్ ముద్దాపురం అభిజ్ఞ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కంది లోకేష్, వెంకట్రావు, కు అవార్డు అందించి, ఘనంగా సన్మానించింది. ఎన్నో సంవత్సరాలుగా పేద ప్రజలకు సంస్థ తరపున వీలైనంత ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నట్లు శ్రీశైలం యాదవ్ తెలిపారు. అవార్డు అందించిన ఓకే టీవీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవలో మరింత ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు చేయడం చట్ట విరుద్ధం

### డ్రగ్ ఇన్స్పెక్టర్ జి.అశ్విని

**ఆసిఫాబాద్ మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి):** నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు చేయడం చట్ట విరుద్ధమని డ్రగ్ ఇన్స్పెక్టర్ జి.అశ్విని తెలిపారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ఉన్న కారిఫోర్డ్ సిరప్ ను సీజ్ చేశారు.

# ఎడిటోరియల్

## విడదల రజనీని వైసీపీ మోయడం అవసరమా ?

విడదల రజనీ. టీడీపీ నుంచి జంప్ చేసి వైసీపీలోకి వచ్చిన నాయకురాలు. ఆమె చిలకలూరిపేట నుంచి 2019లో జగన్ వేవ్ లో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తరువాత ఆమెకు మంత్రి పదవి కూడా దక్కింది. దాంతో ఆమె స్టేట్ వైడ్ లీడర్ అన్న ఇంప్రెషన్ అయితే క్రియేట్ అయింది. నిజానికి విడదల రజనీకి అంత బలం ఉందా స్థాన బలం ఏ మేరకు ఉంది. ఆమె రాజకీయ పరపతి పలుకుబడి వైసీపీకి ఎంత మేరకు ప్లస్ అయ్యాయి అన్నది వైసీపీలోని వారే ఆలోచించుకోవాల్సి వస్తోంది.వైసీపీ పుట్టిన నాటి నుంచి అందులో ఉన్న వారు మర్రి రాజశేఖర్ వంటి వారు. పునాది నుంచి ఉన్న వారు ఇపుడు పార్టీని వీడిపోయారు. టీడీపీలో విడదల రజనీ ఉన్నపుడు వైసీపీ అధినాయకత్వాన్ని చాలా ఎక్కువగా విమర్శలు చేస్తూ వచ్చారు. కానీ ఆమెను చేర్చుకుని అందలాలు అందించడమే వైసీపీలో స్పెషాలిటీ అని అంటున్నారు.ఇక ఆమె ఎమ్మెల్యే అయ్యాక వైసీపీలో వర్గ పోరుకు నాంది పలికారు అని అంటారు. పార్టీలో ముందు నుంచి ఉన్న వారు తన గెలుపునకు సహకరించిన వారిని ఆమె సైడ్ చేయడంతోనే చిలకలూరిపేట వైసీపీలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయని అంటారు.ఇక ఆమె మంత్రి అయ్యాక అనుసరించిన విధానాలు దూకుడు వంటి వాటి మీద చర్చ ఉండనే ఉంది. ఆమె హయాంలో అక్రమాలు జరిగాయని టీడీపీ ప్రభుత్వం ఒక వైపు కేసులు పెడుతోంది. ఆమె హయాంలో జరిగిన అవకతవకలను ఒక్కోటీ వెలికితీస్తున్నారు. ఇక ఆమె అధికారంలో ఉన్నపుడు బాధితులం అయ్యామని అంటున్న వారికి ఇపుడు టీడీపీ అండగా ఉండటంతో ధైర్యంగా బయటకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. దాంతో ఆమె కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విడదల రజనీ మాత్రం తన మీద పెడుతున్న కేసులు అన్నీ రాజకీయ కక్షతోనే అని అంటున్నా ఆధారాలు ఉన్నాయని కూటమి పెద్దలతో పాటు అంతా అంటున్నారు.అనూహ్యంగా మంత్రిగా అవకాశం రావడంతో ఆమె రాజకీయగా దూకుడు చేశారని అంటున్నారు. ఆమె అనుచరులు ఆమె వర్గం అంతా కూడా చిలకలూరిపేటనే కాదు మొత్తం పల్నాడు జిల్లాలోనే చక్రం తిప్పారని అంటున్నారు. ఆమె సమీప బంధువులు పీఏ కలెక్షన్ల పర్వానికి తెర తీశారు అన్న విమర్శలు ఉన్నాయి.అలాగే బదిలీలు ప్రమోషన్లలో విపరీతంగా అవినీతి ఆ రోజులలో జరిగింది అని అంటున్నారు. ఇక వైద్య ఆరోగ్య శాఖలో అడ్డగోలు నియామకాలు చేపట్టారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇక స్టోన్ క్రషర్ యజమాని ఒకరిని బెదిరించి రెండు కోట్ల రూపాయలు పైగా వసూలు చేసినట్లుగా బాధితులు ఆరోపిస్తున్నారుఇవే కాదు రైతులు కొందరికి ప్రభుత్వం సొసైటీగా ఏర్పడితే ప్రభుత్వం భూములు కేటాయించింది. ఆ సాగు భూముల మీద వైసీపీ పెద్దల కన్ను పడడంతో ఆ భూములకు రేటు ఫిక్స్ చేసి మరీ వారికి రైతుల నుంచి విక్రయించేలా చేయడంతో మాజీ మంత్రి వర్గీయుల పాత్ర కీలకంగా ఉందని ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు జగనన్న కాలనీల పేరిట రైతుల నుంచి భూములు తీసుకుని ప్రభుత్వం కట్టిన రేటు కంటే తక్కువ మొత్తాన్ని వారికి చెల్లించి నోట్లో మట్టి కొట్టారన్న దాని మీద వారంతా పోలీస్ స్టేషన్లకు వెళ్ళి మరీ ఫిర్యాదులు చేస్తున్నారు.ఇలా ఒకటి రెండూ కాదు అనేక వివాదాలు అనేక విషయాలలో మాజీ మంత్రి పేరు రావడం ఆమె మీద కేసులు పెడుతున్నారు. దాంతో ఆమె అరెస్ట్ తప్పదని కూడా ప్రచారం సాగుతోంది.

## వృద్ధులకు ఇంటికే మందులు సరఫరా



**పెడన మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**వృద్ధులకు పేదవారికి చేయూతనివ్వాలని దృడసంకల్పంతో ఇంటికే మందులు సరఫరా కార్యక్రమాన్ని చేపట్టినట్లు అమ్మిరెడ్డి రజిని తెలిపారు.సమాజంలో ఏదో ఒక మంచి పని చేయాలని అవమానాలు పడుతూ మందులు కొనుక్కోవటానికి కూడా స్తోమత లేని వృద్ధులు పేదవారి పట్ల ప్రేమ గౌరవంతో నెలసరి వారు వేసుకునే మందులు ప్రభుత్వం వారితో మాట్లాడి ప్రతినెల వారికి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఉచితంగా ప్రతినెలా మెడిసిన్ ఇంటికి రిజిస్టర్ పోస్టర్ ద్వారా మా ఆర్గనైజేషన్ ద్వారా అందచేస్థాము. అని డా. అమ్మి రెడ్డి రజనీ తెలిపినారు. గవర్నమెంట్ డిప్యూటీ సూపర్నెంట్ తో తో మాట్లాడి ఏర్పాటు చేసినారు ఈ సదవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాల్సిందిగా మానవ హక్కుల జాతీయ మహిళా చైర్మన్ డా. అమ్మి రెడ్డి రజిని తెలిపారు. గాంధీ నగర్. మచిలీపట్నం లో ఉన్న మానవ హక్కుల జాతీయ మహిళా కార్యాలయం నందు మీ పేర్లు ఎన్రోల్మెంట్ చేసుకోవాల్సిందిగా కోరినారు. ఈ నెల 27 నుంచి 29ఉదయము 11.00 గంటల నుండి 2.00 గంటలవరకు కావలసిన డాక్యుమెంట్స్ ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో మరియు ప్రతి నెల వాడే మెడిసిన్ ప్రిస్క్రిప్షన్ కాంటాక్ట్ - 70934 34861 08672-350870 సంప్రదించాలని కోరారు.

## కన్నోళ్ల ఋణం తీర్చలేము!



కన్నవారి ఋణమును
ఎవరు తీర్చగలరోయ్!
వారు చూపు త్యాగమును
ఎవరు వ్రాయగలరోయ్!
కనిపించే వేల్పులు
కన్నవారు మహిలో
అసమానము మమతలు
నిలుపుకొనుము మదిలో
విలువైన బహుమతులు
వసుధలోన కన్నవారు
కష్టబెట్టకూడదుజి
వారి ప్రేమ మనసులు
దాచుకో! గుండెల్లో
బ్రతుకులో దీవెనలు
పెట్టుకో! కళ్ళల్లో
అపారమే మేలులు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు

## ఔట్ ఫాల్ డ్రెన్ పనులు త్వరగా పూర్తి చేయండి

● విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు





**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అవుట్ ఫాల్ డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా టికిల్ రోడ్, పినమనేని పాలీ క్లినిక్ రోడ్, కృష్ణవేణి రోడ్, పటమట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జరుగుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని రానున్న వర్షాకాలంలో, వర్షపు నీటి నిల్వలు రోడ్డు మీద నిలవకుండా సైడ్ కాలువలో నిరంతరాయంగా ప్రవహించేటట్టు అధికారులు డిసిల్టింగ్ పనులు ఎప్పటికప్పుడు చేసుకుంటూ ప్రతినిత్యం పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పటమట లోని అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, కిచెన్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఉండేటట్టు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీటి సరఫరా, వాడుకునేటి సరఫరా నిత్యం అధికారులు పర్యవేక్షిస్తుండాలని, ఎండాకాలంలో ప్రజలకు కావాల్సిన అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పురస్కరించుకొని పేదవాళ్లకు ఫిత్ర ఇచ్చి మానవత్వం

# చాటుకుంటున్న ముస్లిం సోదరులు

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి





**కనిగిరి మార్చి 26 వార్తా ప్రభ ప్రతినిధి**కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో బుధవారం పామూరు పట్టణ ముస్లిం టిడిపి శ్రేణులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి పాల్గొన్నారు. ఉపవాస దీక్ష ముగిసిన తర్వాత ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక దువా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పండుగలు మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు సంస్కృతి వికాసానికి దోహదం చేస్తాయన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని ముస్లిం ప్రవక్తలు తెలుపుతుంటారని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో సంవత్సరం మొత్తం వారి సంపాదనలో కొంత భాగం పేదవాళ్ళకి ఫిత్ర ఇచ్చి ఉన్న వారితో పాటు లేనివారు కూడా సమానత్వ సౌభ్రాతత్వంతో పండగ జరుపుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ళ నారాయణరెడ్డి,యారవ శ్రీనివాసులు, డివి మనోహర్, కావిటి సుబ్బయ్య, ఉప్పలపాటి హరిబాబు, గుత్తి రాజా, తదితర టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. షేక్ గౌస్ బాషా, సింగనపల్లి హాజీ మస్తాన్, అష్రఫ్ చిన్న హాజీ మలన్, ఖాజా రహమతుల్లా, మొబీనా మౌలాలి,ఫత్తు మస్తాన్, హాజీ గౌస్, జీలాని బాష, ఆర్ఆర్ రఫీ, సుబహాని, పులి నాయబ, మస్తాన్, రహిమాన్, బ్రూస్ లీ, అస్లీమ్, తదితర ముస్లిం టిడిపి శ్రేణులు ఇఫ్తార్ విందు ఆద్యాంతం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హత్య కేసులో 9 మంది నిందితులను రిమాండ్



**మచిలిపట్నం మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రెండు రోజుల క్రితం మచిలీపట్నం వర్రె గూడెం లో వీర్నాల శ్రీనివాసరావు అలియాస్ టోపీ శీను బ్యాట్ , ఇనుప రాడ్డుతో తలపై మోది హత్య చేసిన కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. ఒకరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. ఇనుకుదురు పేట పోలీస్ స్టేషన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి హత్యకు గల కారణాలు హత్య చేసిన హంతకుల వివరాలు తెలిపారు. హంతకులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. మచిలీపట్నం డి.ఎస్.పి రాజా తెలిపిన వివరాలు ప్రకారం రాజుపేట వర్రెగూడెం వాటర్ ట్యాంక్ సమీపంలో సుంకర వెంకటరమణ, మెరుగు రోహిత్ కొంతమంది కలిసి శ్రీనివాస అలియాస్ టోపీ శీను తో గొడవపడి కొట్టినట్లు ఆ గొడవ కారణం రమన భార్య మాలిన్ తో మృతుడు శ్రీనివాస్ కి అక్రమ సంబంధం ఉందని అనే అనుమానంతో కొట్టి చంపినట్లు డిఎస్పి తెలిపారు.హత్య అనంతరం నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారని, హత్య జరిగినట్టు సమాచారం అందిన వెంటనే కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు నిందితులను అదుపులోకి తీసుకోవడానికి ఐదు బృందాలను నియమించి గాలింపు చర్యలు చేపట్టారు. రాబడిన సమాచారం మేరకు నిందితులు రుద్రవరం టీట్కో గృహ ప్రాంతంలో 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.ఎ1,ఎ2,ఎ3 వద్ద నేరం జరిగినప్పుడు ధరించిన దుస్తులను పోలీసులు సీజ్ చేశారు. నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ కి తరలించారు. హత్య కేసును చేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

## కొండపల్లి మున్సిపల్ ఆశీలు పాటఏ11.30 లక్షలు

పాట దక్కించుకున్న దక్కించుకున్న టిడిపి కౌన్సిలర్ భర్త
ఏప్రిల్ 1 నుంచి ఆశీలు బాదుడు ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, మార్చి 26 (వార్తా ప్రభ ప్రతినిధి):** నాడు ఆశీలు వద్దని, రద్దు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ కౌన్సిలర్లే నేడు ఆశీలు వేలం పాటను దక్కించుకున్నారు. కొండపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ బి.రమ్యకీర్తన అధ్యక్షతన బుధవారం ఆశీలు వేలం పాట నిర్వహించారు. దీనికి టీడీపీ కౌన్సిలర్లు, కౌన్సిలర్ల భర్తలు, వారి తరపు బంధువులు హాజరయ్యారు. కొండపల్లి పట్టణ పరిధిలోని టౌన్ మార్కెట్/ కూరగాయల మార్కెట్/ రోడ్డు మార్జిన్ లు, ఫుట్ పాత్ లపై చిరు వ్యాపారుల నుంచి ఆశీలు వసూలుకు ఈ బహిరంగ వేలం పాట జరిగింది. సర్కారు వారి పాట రూ.10.30 లక్షలతో ప్రారంభమవగా 4వ వార్డు కౌన్సిలర్ బాడిశ అంజనాదేవి భర్త బాడిశ నాగరాజు రూ.11.30 లక్షలు హెచ్చుకు పాడి ఆశీలు వసూలు వేలం పాటను దక్కించుకున్నారు. ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు ఆశీలు వసూలు చేసుకునేందుకు నాగరాజు హక్కు పొందినట్లు కమిషనర్ రమ్యకీర్తన ప్రకటించారు.

## ప్రతిపక్షంలో 'అలా' అధికారపక్షంలో 'ఇలా'

● ఆశీలు విషయంలో మాట మార్చిన టిడిపి ● రూ.11.30 లక్షలకు దక్కించుకున్న 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అంజనాదేవి భర్త నాగరాజు ● దరిదాపుల్లో కనిపించని వైసీపీ నేతలు కౌన్సిలర్లు



**ఇబ్రహీంపట్నం, మార్చి 26 (వార్తా ప్రభ ప్రతినిధి):** నాడు ఆశీలు వద్దని, రద్దు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ కౌన్సిలర్లే నేడు ఆశీలు వేలం పాటను దక్కించుకోవడం విశేషం. 4వ వార్డు కౌన్సిలర్ బాడిశ అంజనాదేవి భర్త బాడిశ నాగరాజు రూ.11.30 లక్షలు హెచ్చుకు పాడి ఆశీలు వసూలు వేలం పాటను దక్కించుకున్నారు.ఈ నేపథ్యంలోనే ఆశీలు వేలం పాట ఏకపక్షంగా జరిగిందని, చిరు వ్యాపారులను ఇబ్బందులు పెట్టే ఆశీలును రద్దు చేయాలని టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా నా నా రాద్ధాంత చేశారు. ఫిర్యాదులు, నిరసనలతో హోరెత్తించారు. దీంతో 8 నెలలు ఆశీలు వసూలు నిలిచిపోయింది. అప్పుడు దేవినేని ఉమా, టీడీపీ కౌన్సిలర్ల తీరుతో విస్తుపోయిన నాటి వైసీపీ (నేడు టీడీపీ) ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆశీలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. నాడు రద్దు చేయాలని డిమాండ్ చేసిన టీడీపీ కౌన్సిలర్ లు పాటలో పాల్గొని వేలం పాటను దక్కించుకోవడంతో పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో 'అలా' అధికార పక్షంలో 'ఇలా'అని చర్చించుకుంటున్నారు.**దరిదాపుల్లో కనిపించని వైసీపీ** వైసీపీ నాయకులు, కౌన్సిలర్ లు కార్యాలయ దరిదాపుల్లో కనిపించకపోవడంతో వేలంపాట ప్రశాంతంగా జరిగింది. 2023 వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆశీలు విషయంలో టిడిపి చేసిన రాద్ధాంతం తిరిగి వైసిపి పునరావృతం చేస్తుందా...? లేక మనకెందుకులే అని చోద్యం చూస్తుందా....? వేచి చూడాలి.

## చిట్టినగర్ మోతి మసీదు ప్రాంగణంలో రంజాన్ తోఫా పంపిణీ





**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిస్థానిక 48 డివిజన్ మోతి మసీద్ ప్రాంగణంలో గల షాదీఖానా లో బుధవారం వైసిపి నాయకులు షేక్ మహారాజ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, నజీర్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ తోఫాని పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైయస్ ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతమ్ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, దుర్గ గుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు మహ్మద్ అన్వర్, రషీద్, యుసుబ్, సమీర్, ఖాజా, ఉస్మాన్, వలి, వైసిపి నాయకులు పిళ్ల సూరి బాబు (జగ్గు), అయితా కిశోర్, చిచ్చా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ కారుణ్య నియామకాల ఉత్తర్వులు



**మచిలిపట్నం మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** ఉద్యోగ విధులు బాధ్యతాయుతంగా అంకితభావంతో నిర్వహించాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నగరంలోని వారి చాంబర్లో 17 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. అందులో 12 మంది జూనియర్ అసిస్టెంట్లుగా, మరో 5మంది టైపిస్టులుగా నియమించబడ్డారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పంచాయతీరాజ్ ఉద్యోగులు 17 మంది విధి నిర్వహణలో ఉంటూ మరణించడంతో వారి వారసులకు నియామక పత్రాలు అందజేసినట్లు జడ్పీ చైర్ పర్సన్ వివరించారు. కొత్తగా నియమించబడిన ఉద్యోగులు సజావుగా వారికి అప్పగించిన విధులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈఓ కన్నమ నాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్ జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 28లోగా ఫేజ్-2 వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి

- జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి కె.శ్రీనివాస శిరోమణి

**విజయవాడ, మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు షార్ట్‌లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా https://mdfc.apcfss.in పోర్టల్‌లో ఉందని, జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా ఫేజ్-2 వెబ్ ఆప్షన్ సర్వీస్ ద్వారా ఎంప్యానెల్డ్ కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యతలు ఇవ్వాలని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి కె. శ్రీనివాస శిరోమణి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ద్వారా అభ్యర్థులు అన్ని కోచింగ్ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ దశలో ఫేజ్-1 వెబ్ ఆప్షన్లను సవరించేందుకు వీలవదని తెలిపారు.

## నేడు కొండపల్లి ఖిల్లా హజ్రత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ బాబా 437వ ఉరుసు మహోత్సవంబి



**ఇబ్రహీంపట్నం, మార్చి 26 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి ఖిల్లాపై హజరత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ బాబా వారి 437వ ఉరుసు మహోత్సవం ఈ నెల 27న జరుగుతుందని ముజావర్ సయ్యద్ ఖాజా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ముజావర్ వీధి నుంచి రాత్రి 11 గంటలకు మేళతాళాలు, భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యే ఉరుసు మహోత్సవ ఊరేగింపు పురవీధుల్లో తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు కొండపల్లి ఖిల్లా మీద ఉన్న దర్గా వద్దకు చేరుకోవడంతో ముగుస్తుందన్నారు. బాబా వారికి గంధం సమర్పించిన అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేస్తారు. భక్తులు వేలాదిగా ఉరుసు మహోత్సవానికి హాజరై బాబా ఆశీస్సులు పొందాలని కోరారు. 28న శుక్రవారం కొండపల్లి ముజావర్ వారి వీధి షాదీఖానా వద్ద దీపారాధన, భక్తులకు భారీ అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

# స్వీయ నమ్మకం నిర్మాణం మరియు వ్యక్తిగత భద్రతపై 3రోజుల వర్క్ షాప్

**విజయవాడ పశ్చిమ మార్చి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కొత్తపేట లో ఉన్నపొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలోనిపీఎస్సీఎంఆర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (ఆటోనమస్)లోని మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 24నుండి 26, 2025 వరకు యం.సి.ఏ, యం.బి.ఏ , ఈ. ఈ. ఈ విద్యార్థులకు "స్వీయ నమ్మకం నిర్మాణం మరియు వ్యక్తిగత భద్రతను పెంపొందించడం" పై మూడు రోజుల వర్క్షాప్ విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా ఎం. అంకమ్మరావు (తైక్వాండో జిల్లా కార్యదర్శి) మరియు మిస్టర్ పి. ఆదిత్య(నేషనల్ రెఫరీక్యోరుగు మరియు పూమ్సే) హాజరై విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. వారు ఆత్మవిశ్వాసంపెంపొందించుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో స్వీయ రక్షణను మెరుగుపరుచుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు.ప్రాక్టికల్ సెషన్స్ ద్వారా విద్యార్థులకు తైక్వాండో మూలాలు, స్వీయ రక్షణ పద్ధతులను ప్రాక్టికల్గా నేర్పారు.కళాశాల సెక్రటరీ డాక్టర్ సి.ఎ. చిట్టా



అమర్ సుధీర్ , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్. శరవణ కుమార్,ఐ.సి.సి కన్వీనర్ డాక్టర్ రామదేవి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వారు రిసోర్స్ పర్సన్స్క కృతజ్ఞతలు తెలియజేస్తూ,ఇలాంటి వర్క్షాప్ ల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి పెంపొందించడంలో ఎంతగానో సహాయపడతా యని ప్రాముఖ్యతను తెలియజే శారు. ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు కేవలం శారీరక రక్షణనే కాకుండా, మానసికంగా,భావోద్వేగాల పరంగా బలపడడం నేర్చుకున్నారు. ఇది భవిష్యత్తులో వారి వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాలను పొందటానికిదోహదపడుతుందని తెలియజేశారు.

## ముస్తాబాద్ లో ఇఫ్తార్ విందు



**గన్నవరం, మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** గన్నవరం మండలంలోని ముస్తాబాద్ గ్రామంలో ముస్లిం సోదర సోదరీమణులకు ఇఫ్తార్ విందును ఇవ్వడం జరిగింది. గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన స్వర్గీయ షేక్ దస్తగిరి సాహెబ్ మరియు జవహర్ బేగం గార్ల జ్ఞాపకార్థం వారి కుమారులు గ్రామంలో ఉపవాసం ఉంటున్న దాదాపు 450 మంది ఉపవాస దీక్ష పరులకు స్థానిక కళ్యాణ మండపం నందు ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగింది. వారి కుమారులలో ఒకరైన నవభారత్ హై స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్ మాట్లాడుతూ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు తమ తల్లిదండ్రుల పేరు మీద మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందును ఇవ్వడం జరిగిందని గ్రామంలోని ప్రతి ముస్లిం ఈ ఇఫ్తార్ విందులో పాల్గొని విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమ సోదరులు మహమ్మద్ అక్బర్, మహమ్మద్ ఉస్మాన్, మహమ్మద్ ఉమర్, మహమ్మద్ అహ్మద్ అలీ, మహమ్మద్ షఫీ ఉల్లా, షేక్ ఈసా రూపుల్లా, షేక్ ఖలీల్ రెహమాన్, గ్రామ పెద్దలు మరియు మత పెద్దలు పాల్గొనడం జరిగింది

## తాజ్ ఉద్దీన్ బాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్త్రీలకు చీరలు పంపిణీ



**హనుమాన్ జంక్షన్, మార్చ్ 26(వార్తాప్రభ)**కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బాపులపాడు గ్రామంలోని సయ్యద్ తాజ్ ఉద్దీన్ బాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సహకారాలతో బాపులపాడు గ్రామం తాసిల్దార్ కార్యాలయం సమీపంలోని పేద ప్రజలకు పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని పేద ప్రజలకు స్త్రీలకు చీరలు పంపిణీ చేశారు. సుమారు 50 మందికి పైగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ అక్బర్ షరీఫ్ సూఫీ ,ట్రస్ట్ సభ్యులు ,రహీం ఇబ్రహీం, మరియు మసీదు కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షలో విజేతలకు బహుమతులు అందజేత



**మైలవరం మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి):**ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సంయుక్తా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 10వ తరగతి ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులుకు బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు బహుమతులు అందజేశారు.మైలవరం మండల వ్యాప్తంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత నెలలో నిర్వహించిన ప్రజ్ఞ వికాసం మోడల్ టెస్ట్ లో మండలం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.మొత్తం 100 మార్కులకు గాను 87 మార్కులు సాధించిన టి భాను శ్రీ మండలం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా,వై.దివ్యసాయి 86 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది.అలాగే 83 మార్కులు సాధించిన ఎస్.హర్షవర్ధన్ తృతీయ స్థానంలో నిలిచాడు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కుమార్ నాయక్ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలులో అధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఒక ఆశయంతో ముందుకు వెళ్లాలన్నారు.విద్యారంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను గమనించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.పరీక్షల్లో భయాన్ని పోగొట్టి వారికి మనోధైర్యాన్ని ఇచ్చేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా టెన్త్ విద్యార్థులకు ముందస్తుగా ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించడం జరిగిందని తెలిపారు.దీంతో వారు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సుధాకర్, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# లోగోట్టు పెరుమాలి కెరుగ





**చంద్రగిరి: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**చంద్రగిరి గ్రామపంచాయతీలో జరగవలసిన వేలం పాట గత నెల రోజులుగా వాయిదాల మీద వాయిదాలు పడుతూ పడుతూ ఉంది. వివరాల్లోకి వెళ్తే చంద్రగిరి గ్రామపంచాయతీ పరిధిలోని వారపు సంత, ప్రైవేట్ బస్టాండ్, జంతు వదశాల నందు రూసములు వసూలు చేసుకునే హక్కు పొందేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు బుధవారం జరిగిన బహిరంగ వేళము నందు అధికారుల లోగోట్టు పెరుమాలికెరుగ వలె తమ తీరును ప్రదర్శిస్తున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలంపాటలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు పోటాపోటీగా 24 లక్షల పైగా వేలం పాట పాడుతుండగా మధ్యలో ఓ టిడిపి నాయకుడు కల్పించుకొని పిల్లలు ఆవేశంలో పాట పాడారని రద్దు చేయాలని పంచాయతీ కార్యదర్శి కి ఆదేశించారు. టిడిపి నాయకుల మాటలకు తలొగ్గి వెంటనే పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం నాయుడు వెంటనే మైకు తీసుకొని వేలంపాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై కొంతమంది టిడిపి నాయకులు అభ్యంతరం తెలిపిన ఇవేమీ పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి వేలంపాట రద్దు చేయడంపై చంద్రగిరి పట్టణ ప్రజలు అధికార పార్టీ నాయకులకు ఎంపీడీవో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, పంచాయితీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించిన ఎమ్ ఎల్ ఎ కాగిత

**పెడన మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**పెడన నియోజవర్గం పెడన మండలం అచ్చయ్య వారిపాలెం జింజేరు గ్రామాలలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించారు.అవినీతి, కక్ష పూరిత రాజకీయాలతో గత వైసిపి ప్రభుత్వము, స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులు కాలం గడిపేసారని ఫలితంగా నేడు ప్రజల నుండి సమస్యలు వెల్లువెత్తుతున్నాయని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పెడన నియోజకవర్గ పెడన మండలంలో బుధవారం నాడు ప్రజా గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ కు ప్రజలు తెలుగుదేశం పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ...ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అభివృద్ధి మరియు సంక్షేమాన్ని అందించాలన్న లక్ష్యంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.ప్రజలకు ప్రభుత్వాన్ని మరియు సేవలను మరింత చేరువ చేయటానికి ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో అనేక సేవలను అందిస్తుంది.ఈ రోజు మరో ముందడుగు వేసి ప్రతి బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ ఆదేశించటాన్ని నేను స్వాగతిస్తున్నాను.గ్రీవెన్స్ డే నిర్వహించిన ప్రతి రోజు కూడా అనేక సమస్యలతో వస్తున్నారు.ప్రధానంగా నియోజకవర్గం లో కనీస మౌలిక



సదుపాయాలు అయిన డ్రైన్లు, రోడ్లు మంచినీటి సమస్యలు తీర్చమని కోరుతున్నారని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా నగేష్ మండల టిడిపి అధ్యక్షుడు సలపాటి ప్రసాద్ ప్రధాన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుడిసేవ రామారావు సర్పంచ్ లు వేముల సత్యనారాయణ చిత్త జల్లు నరసింహారావు నందమూరు మాజీ సర్పంచ్ పరసా రాంబాబు కాగిత వాసు నీటి సంఘం అధ్యక్షుడు పరసా నాగరాజు మట్ట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంతేరులో ప్రభుత్వ భూముల అక్రమ విక్రయాలు



**కృత్తివెన్ను మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో ప్రభుత్వ బంజర భూములను అక్రమంగా విక్రయించటం కలకలం రేపింది ఇంతేరు గ్రామానికి చెందిన పెదసింగు పాండురంగారావు అనే ఒక దళారి మడ అడవులకు చెందిన ప్రభుత్వ భూములను తన సొంత భూమిగా చూపించి విక్రయిస్తున్న వార్త సంచలనం రేపింది గత రెండు సంవత్సరాలుగా ఇతనిపై ఇదే తరహాలో కేసులు నమోదైనప్పటికీ ఇతనిలో మార్పు రాకపోవడం శోచనీయం బడా బాబుల అండదండలు లేకుండా అతను ఈ దుర్మార్గానికి ఒడికట్టడు అని గ్రామస్తుల ఆవేదన స్థలాన్ని అక్రమంగా కొనుక్కున్న వ్యక్తులు గ్రామంలోకి వచ్చి కొలతలు కొలుస్తుండడంతో గ్రామస్తులంతా ఏకమై వారిని నిలదీయగా ఆ గ్రామ ప్రెసిడెంట్ తమ్ముణ్ణి అని చెప్పుకునే ఈ దళారి పాండురంగారావు చేసిన పనే అని... ఇతను ఇక మారడు అంటూ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటే కానీ ఇటువంటి దళారులకు ఒక గుణపాఠం కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు విషయాన్ని తెలుసుకుని పరిశీలించిన రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు నచ్చ చెప్పి అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేసు ఇప్పటికే నమోదు చేశామని తెలిపారు ప్రభుత్వ భూములను అన్యాక్రాంతంగా అక్రమ పద్ధతిలో విక్రయించటం నేరమని గుర్తుచేసి ఇటువంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులను ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని వారు తెలిపారు

## వాస్తవానికి విరుద్ధంగా పశుగణన లెక్కలు చూపించాలంటూ పై అధికారుల వత్తిడి

### గందరగోళంలో ఎన్యుమరేటర్లు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ విజ్ఞప్తి.




**పెడన మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నటువంటి పశుగణన లెక్కలలో అక్రమాలకు తెరలేపాలని చూస్తున్నారు.లేనిది ఉన్నట్లుగా చూపించాలంటూ పై అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందికి ఒత్తిడిలు ఎక్కువవుతున్నాయి. ఈ విషయాన్ని క్రింది స్థాయి సిబ్బంది కూడా ధ్రువీకరిస్తున్నారు.అలాగే వారు ఆందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు. మార్గదర్శకంగా ఉండవలసిన పై అధికారులే కిందిస్తాయి ఉద్యోగులను పక్కదారి పట్టించే విధంగా ప్రవర్తించడం ఆశ్చర్యకరంగా వుంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చేసుకోవాలని వారు కోరుతున్నారు. అఖిలభారత 21 వ పశుగణనలో భాగంగా క్షేత్రస్థాయిలో విషయ సేకరణదారులు పారావెట్స్ వి ఎల్ ఓ జెవిఓ ఎల్ఎస్ఏ మరియు విఏ లు పశుసంవర్ధక సహాయకులు(ఏహెచ్ఏ ) జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో కూడా వాస్తవిక పశుసంపదను గనించడం జరుగుతున్నది. అయితే ఇటీవల కొందరు రాష్ట్ర జిల్లాస్థాయి అధికారులు ప్రతి గ్రామంలో కూడా పశుసంపద లేకపోయినా కూడా 5 సంవత్సరాల క్రితం జరిగినటువంటి 20వ పశుగణన లో ఉన్న పశువులనే ఈగణనలలో కూడా ఉన్నట్లే ఆన్లైన్లో చూపించాలని ఎన్యుమరేటర్స్ పై ఒత్తిడి తీసుకురావడం జరుగుతున్నది. నిజానికి 'ఖచ్చితమైన పశుసంపదను మాత్రమే గణించాలి' అని చెప్పాల్సింది పోయి, లేని పశువులను కూడా ఉన్నట్లుగా చూపించాలని ప్రతి ఎన్యుమరేటర్ పై ఒత్తిడి తెస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకొని క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ చేస్తున్నటువంటి ఎన్యుమరేటర్లపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా కేవలం ఖచ్చితమైన వాస్తవికమైన పశువులను మాత్రమే లెక్కించే విధంగా ఆదేశాలు ఇప్పించవలసిందిగా ఎన్యూమరేటర్లు జిల్లా కలెక్టర్ బాలాజీ కి విజ్ఞప్తి చేసారు.

## ప్రమాద హెచ్చరికల బోర్డుల ఏర్పాటు

### బోర్డులో ఏర్పాటు పర్యవేక్షించిన ట్రాఫిక్ ఆర్ఎస్సై లక్ష్మణరావు




**ఇబ్రహీంపట్నం, మార్చి 26 (వార్తా ప్రభ ప్రతినిధి):** రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ ఆర్ఎస్సై బి.లక్ష్మణరావు తెలిపారు. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు సీఐ ఎ.చంద్రశేఖర్ చొరవతో గుంటుపల్లి రమేష్ నగర్ - దొనబండ, దొనబండ - రమేష్ నగర్ వరకు 65 నెంబర్ జాతీయ రహదారిపై ముఖ్య కూడళ్లలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అతివేగంతో వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని సూచించారు.

## చలివేంద్రం ప్రారంభించిన మున్సిపల్ ఏఈ మోస్మీ



**ఇబ్రహీంపట్నం, మార్చి 26( వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈలప్రోలు పేద ప్రజలకు ప్రభుత్వ కేటాయించిన కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ ఏఈ మోస్మీ బుధవారం నాడు ప్రారంభించారు.చలివేంద్రం ఏర్పాటు చేసిన కాలనీ వాసులను అభినందించారు. చలివేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టిలో నీరు అత్యంత విలువైనదని,వేసవికాలం ఏ ఒక్కరూ కూడా తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదని కాలనీ వాసులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వర్తించాలని కోరారు.మూగజీవులకు కూడా వేసవిలో తాగునీటిని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

## డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ విక్రాంత్తో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) భేటీ




**విజయవాడ పశ్చిమ మార్చి 26 (వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బుధవారం ఢిల్లీలోని డీఆర్డీఓ భవన్లో భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) చైర్మన్ డాక్టర్ సమీర్ విక్రాంత్ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్, డీఆర్డీఓ చైర్మన్కు తిరుపతి ప్రసాదం అందజేశారు. వీరిద్దరూ రక్షణ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఎపి నూతన రాజధాని అమరావతి లో భాగమైన విజయవాడ పరిసర ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి రక్షణ ఉత్పత్తి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఎంపీ శివనాథ్ (చిన్ని) కోరగా, డీఆర్డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ విక్రాంత్ ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు.

## జగన్ ను కలిసిన వేల్పుల దంపతులు

**పెనుగంచిప్రోలు, మార్చి 26( వార్త ప్రభ )** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన రెడ్డి తో బుధవారం మధ్యాహ్నం కలిసిన సందర్భంగా అత్యంత ప్రేమాభిమానాలతో వెల్లి విరిసిన ఆనందోత్సవాల మధ్య సర్పంచ్వేల్పుల పద్మ కుమారి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ లు హర్షం వ్యక్తం చేశారు.



# బాధితులకు సీఎం సహాయనిధి ఎల్ఓసి చెక్కుల పంపిణీ






**కుత్బుల్లాపూర్ మార్చి 26 (వార్తాప్రభ) :** గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్ ప్రాంతానికి చెందిన కొరవర నర్సమ్మ భర్త బాసప్ప (36), రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన కేశవ్ పట్ల అరులప్ప తండ్రి జోసెఫ్ (48) లు గత రెండు రోజుల క్రితం వారి ఆరోగ్య పరిస్థితిపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని ఆశ్రయించగా వారి ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితిపై చలించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కొరవర నర్సమ్మ భర్త బాసప్ప (2,00,000/-), రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన కేశవ్ పట్ల అరులప్ప తండ్రి జోసెఫ్ (2,00,000/-) లకు ఎల్ఓసీ మంజూరు చేయించగా బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎల్ఓసీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం సహాయనిధి అని, నిరుపేదల ఆరోగ్య బాగోగులకై చలించే మా నాయకులు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేదల అరోగ్యపరిస్థితిపై ఎప్పుడూ ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, గాజుల రామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, బాలయ్య నగర్ కాలనీ వెల్ఫేర్ అధ్యక్షులు నగేష్, సీనియర్ నాయకులు ఓంకార్ రెడ్డి, సుధాకర్, అఖిల్, రాజు, కె.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలు తొలగించి కాలనీలో రోడ్డు నిర్మాణం చేయాలి

## మిర్జాలగూడ సంక్షేమ సంఘం సభ్యుల డిమాండ్



**మల్కాజిగిరి మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి):** ఆక్రమణలు తొలగించి కాలనీలో రోడ్డు నిర్మాణం చేయాలని మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్ మిర్జాలగూడ సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేటర్ ఆక్రమణదారులకు అమ్ముడు పోయి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తక్షణమే తమ డివిజన్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్జాలగూడ సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్య నారాయణ రెడ్డి, కార్యదర్శి శోభా రాణి, విజయకుమార్, జాయింట్ సెక్రటరీ జంగాల శ్రీరామ్ యాదవ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ తదితరులు మాట్లాడారు. వర్షాలు వచ్చిన సమయంలో ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి తమవద్ద ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల హైడ్రా అధికారులు తమ ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలు మార్కింగ్ చేసినా వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

# పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై క్రైస్తవ సంఘాల ఆందోళన

## సిబిఐ విచారణ చేయాలంటూ మల్కాజిగిరిలో నిరసన



**మల్కాజిగిరి : మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై క్రైస్తవ సంఘాలు ఆందోళన చేపట్టాయి. సిబిఐ విచారణ చేయాలంటూ మల్కాజిగిరి కూడలిలో బుధవారం క్రైస్తవ సోదరులు నిరసన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ క్రైస్తవ సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన ఘటనలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి చెందారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై సోమవారం రాజమహేంద్రవరం బయలుదేరిన ప్రవీణ్‌కుమార్ అర్ధరాత్రి సమయంలో కొంతమూరు వద్ద ప్రమాదానికి గురయ్యారు. రహదారి పైనుంచి దిగువకు ప్రమాదవశాత్తు జారిపోయారని, వాహనం అతనిపై పడిపోవడంతో బలమైన గాయాలై ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు చెప్పారని జేఏసీ నేత బెజవాడ రవికుమార్ వెల్లడించారు. అయితే ఆయన మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయనకు చాలా బెదిరింపు కాల్స్ వచ్చాయని, ఆయనను టార్గెట్ చేసి చంపారని ఆరోపించారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై సిబిఐ విచారణ జరిపించాలని ఎన్ సీసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి బిషప్ డాక్టర్ బక్క ఏలియా డిమాండ్ చేశారు. మతోన్మాదులు ఈ దారుణానికి ఒడిగట్టారని, ఈ ఘటన పై ప్రభుత్వం కళ్ళు తెరవాలని సిరి కోరారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి నాయయం చేయాలన్నారు. ప్రభుత్వాలు, కోర్టులు ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చూడాలని వసంత్ విజ్ఞప్తి చేశారు.

# వేలేరు అమ్మా నిలయంలో వార్షికోత్సవం



**హనుమాన్ జంక్షన్, మార్చి 26(వార్తాప్రభ)**బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో నిర్వహించబడుతున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయ లో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ పిసి ఫణి దుర్జాటి హాజరయ్యారు. బాపులపాడు మండల విద్యా శాఖధికారి రాంబాల సింగ్, జెడ్పిటిసి మాజీ సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, స్థలదాత రాధాకృష్ణ , ఎంఐఎస్ కోఆర్డినేటర్ అబ్దుల్ సుభాన్, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, ఐ ఇ డి కోఆర్డినేటర్ రాంబాబు, వార్డెన్ డి సునీత , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. 2012 సంవత్సరము నుండి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు హాజరయ్యారు, విద్యార్థులతో మాట్లాడి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

# లాయర్ ఇజ్రాయిల్ హత్య దారుణం!!

- దోషులను అత్యంత కఠినంగా శిక్షించాలి
- లాయర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బిజెపి పోరాటం
- రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**హైదరాబాద్‌లో లాయర్ ఇజ్రాయిల్ హత్య దారుణం అని రామగుండం భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గోదావరిఖని కోర్టు ఎదుట లాయర్ ఇజ్రాయిల్ హత్యను ఖండిస్తూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావాన్ని తెలిపారు సంధ్యారాణి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... లాయర్ ఇజ్రాయిల్ హత్య న్యాయవ్యవస్థపై దాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. దోషులను అత్యంత కఠినంగా శిక్షించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి అని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునారపుతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాయర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బిజెపి పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వెంట రమేష్, భూమయ్య, రాజకుమార్, చారి, వీరేశం తదితరులు ఉన్నారు.

# లాయర్లకే రక్షణ లేకపోతే ఎలా?!!

- న్యాయవాదిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా
- దోషులకు మరణశిక్ష విధించాలి తక్షణమే ప్రభుత్వ సాయం అందించాలి
- 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో లాయర్లకే రక్షణ లేకపోతే ఎలా? అని రామగుండం నగరపాలక సంస్థ 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్ చంపాపేటలో సీనియర్ లాయర్ ఇజ్రాయిల్ హత్యను ఖండిస్తూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతును ప్రకటిస్తూ సంఘీభావం తెలిపారు సతీష్ కుమార్. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ..... సీనియర్ అడ్వకేట్ ఇజ్రాయిల్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దోషులకు మరణశిక్ష విధించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ కోసం నూతన చట్టాలను అమలు చేయాలని, అసెంబ్లీ సమావేశాల్లో బిల్ పాస్ చేయాలి అని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ సహకారంగా లాయర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిరాహార దీక్షలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సతీష్, కిషన్ రావు, శైలజ, రవీందర్, అంజయ్య, మనోహర్, శ్రీనివాసరావు, వెంకట్, కుమార్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, కిరణ్, రాజ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే పట్టణ కేంద్రానికి, అక్రమ ఇసుక రవాణా

- ఇసుకసురుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలు బేఖాతర్



**తొర్రూర్ మార్చి 26 (వార్తా ప్రభ)** స్థానిక పట్టణ కేంద్రానికి పట్టబగలే అక్రమ ఇసుక రవాణా, చేస్తున్న, మండల రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూడడంతో చర్చనీ అంశంగా మారింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఇసుకకు ఎలాంటి అనుమతులు లేవని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతూ, ఇసుకసురులకు మండల అధికార యంత్రాంగం, కొమ్ము కాయడంతో, యదేచ్ఛగా, అక్రమంగా ఇసుక రవాణా, అక్రమార్కులు, చేయడం ఆనవాయితీగా మారిందని స్థానికులు చెప్పుకొస్తున్నారు. ఇసుక రవాణా చేసే వ్యవసాయ ట్రాక్టర్లు, నెంబర్ ప్లేట్లు లేకుండా, ఇసుకను తొర్రూర్ పట్టణ కేంద్రానికి రవాణా చేయడం విశేషం. “ఇసుక రవాణా పై ఉక్కు పాదం మోపుతానన్నా, అధికారుల మాటలు, నీళ్ల మూటలేనా” అని స్థానికులు ముచ్చటిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న అక్రమార్కులకు, అడ్డుకట్ట పడేది ఎన్నడంటూ, స్థానికులు నివ్వరపోతున్నారు. ఈ దందా ఈ విధంగానే కొనసాగితే, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయితే, “ఎంకి పెండ్లి సుబ్బి చావుకు వచ్చిన చందంగా”మారనున్నదని స్థానికులు భావిస్తున్నారు. కావున జిల్లా ఉన్నత అధికారులు దీనిపై దృష్టి సారించి, అక్రమ ఇసుక రవాణాను నిలువరించాలని కోరుతున్నారు.

# అభివృద్ధి పథంలో ముందంజలో మల్కాజిగిరి



**మల్కాజిగిరి మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి):** మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అభివృద్ధి లో ముందుకు సాగుతున్నారని పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. బుధవారం బృందావన్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీతా రాము యాదవ్, మురుగేష్ , జగదీశ్ గౌడ్, బద్దం పరశు రామిరెడ్డి, వెంకన్న, ఖలీల్, రావుల అంజయ్య, బాగ్యనందరావు తదితరులు మాట్లాడారు. ప్రధాన అభివృద్ధి పనుల్లో ఆర్.కే పురం ఫ్లై ఓవర్నిర్మాణం కొరకు రూ. 210 కోట్లు, ఆర్.కే.పురం నిర్మాణం కొరకు రూ. 35 కోట్లు, జి.హెచ్.ఎం.సి ద్వారా సాధారణ పనుల కొరకు రూ. 13 కోట్లు, ఎస్ ఎన్ డీ పీ ద్వారా నేరేడు మెట్ డివిజన్ యాప్రాల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణం కొరకు రూ. 6 కోట్లు, మౌలాలి డివిజన్ ఆర్.టీ.సి.కాలనీలో బాక్స్ డ్రైన్ నిర్మాణం కొరకు 1.7కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.రైల్ అండర్ పాస్ ప్రాజెక్టులు : వాజపేయి నగర్ ఆర్.యు.బి. నిర్మాణం కొరకు 72 కోట్లు, గౌతమ్ నగర్ ఆర్.యు.బి. కొరకు 28 కోట్లు( త్వరలో పనులు ప్రారంభం), తుర్కపల్లి ఆర్.యు.బి. నిర్మాణం కొరకు 8 కోట్లు (త్వరలో పనులు ప్రారంభం ), అల్వాల్ జనప్రియ అప్పార్ట్మెంట్ వద్ద ఆర్.యు.బి. నిర్మాణం కొరకు 8 కోట్లు, రైల్వే ఆర్.యు.బి. / ఆర్.ఓ.బి ల నిర్మాణం చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చాలనే దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే విశేష కృషి చేస్తున్నారని చెప్పారు.విద్యుత్ శాఖ కు సంబంధించిన అభివృద్ధి పనులు : విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేసి ఎమ్మెల్యే సాధించిన ఘనత 9.74 కోట్లు మంజూరు అయినట్లు వివరించారు. మల్కాజిగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ ఫేస్ నుండి త్రీ ఫేస్ లైన్లకు మార్పు, అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ల సామర్థ్యం పెంపు, కొత్తగా 118 ట్రాన్స్ఫార్మర్ ల ఏర్పాటు, ఇంటర్ లింక్ ఫెడర్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం :ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం సైనిక్ పురి లోని పోలీసే కమీషనర్ కార్యాలయం వెనకాల 500 గజాల ప్రభుత్వ భూమిని మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే దే నని, అల్వాల్ ప్రాంతంలో హెల్త్ సెంటర్ ఇదివరకే ప్రారంభం అయ్యిందన్నారు. డిగ్రీ కాలేజీ కోసం ,నేరేడు మెట్ వాజపేయి నగర్ లోని పాత కోర్టు భవనంలో ఏర్పాటు చేయడం కోసం, జిల్లా కోర్టు భవనానికి అదనంగా నిధులు సాధించారని చెప్పారు. ఇదివరకే మంజూరైన కోర్టు భవన నిర్మాణంలో నిధులు సరిపోకపోవడంతో జాప్యం జరుగుతుందని అదనంగా మరో 46 కోట్ల ను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దేనన్నారు. ఫైర్ స్టేషన్ : అల్వాల్ ప్రాంతంలో ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం 11 గుంటల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయించిన ఎమ్మెల్యే. ( ఏదైనా ప్రమాదం జరిగితే ఇతర ప్రాంతాలను నుండి ఫైర్ స్టేషన్ ఇబ్బంది సిబ్బంది వచ్చే వరకు పూర్తిగా నష్టం జరిగిన సంఘటనలు అల్వాల్ ప్రాంత ప్రజలు చూశారు, ఎమ్మెల్యే గారి చొరవతో ఇప్పుడు అల్వాల్ లోనే ఫైర్ స్టేషన్ నిర్మాణం జరుగుతుంది. ఇది కేవలం ఎమ్మెల్యే సాధించిన ఘనత అన్నారు. ఇంకా ఎన్నో పనులకు సంబంధించి త్వరలోనే అధికారికంగా మంజూరు కావడం జరుగుతుంది. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేత అంశంలో పేదలకు అన్యాయం జరగకుండా చూడాలనే గట్టి సంకల్పంతో ప్రభుత్వం పై ఒత్తిడి చేసి శాసనసభలో కూడా ప్రస్తావించడంతో సంబంధిత మంత్రి గారు సానుకూల ప్రకటన చేయడం ఎమ్మెల్యే సాధించిన మరో ఘనత, హైదరాబాద్ ప్రజలను అతలాకుతలం చేసిన హైడ్రా పై యుద్ధం ప్రకటించి భయభ్రాంతులకు గురవుతున్న ప్రజల పక్షాన నిలబడి, అవసరమైతే సుప్రీం కోర్టులో కూడా న్యాయ పరంగా సొంత నిధులతో ప్రజల కోసం పోరాటం చేస్తానని ప్రజలకు భరోసానిచ్చారు.

# గన్నవరం నియోజకవర్గ అభివృద్దే ఏకైక లక్ష్యం

## శాసనసభలో మాట్లాడిన మాటలను సైతం వక్రీకరించడం అనైతికం శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదికను ప్రారంభించిన ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు





**గన్నవరం, మార్చి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం పట్టణంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం యొక్క ఆలయ పాలకవర్గం నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదికను ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు గారు ఈరోజు ఉదయం రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు.శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదిక ప్రారంభోత్సవానికి హాజరైన యార్లగడ్డ వెంకట్రావును ఆలయ పాలకవర్గం కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతించి శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికను వేదమంత్రోచ్చారణల మధ్య రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఆలయ పాలకవర్గ సభ్యులను అభినందించారు. త్వరలోనే తాను కూడా రెండు లక్షల రూపాయలను ఆలయ కమిటీ వారికి అందజేయనున్నట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నానని గన్నవరం ముఖచిత్రం మార్చే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల శాసనసభలో తాను ప్రసంగిస్తూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో కృష్ణాజిల్లాలోని పి.ఎ.సి.ఎస్ ల పరిధిలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని దీనిపై ఎంక్వయిరీ చేసి రైతుల సొమ్మును అక్రమంగా కాజేసిన వారిని శిక్షించాలని సంబంధిత మంత్రివర్యులను కోరగా, ఒక వర్గం మీడియా దీనిని సైతం వక్రీకరిస్తూ వార్తలను చిత్రీకరిస్తున్నారని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. తన సొంత కంపెనీ కంటే ఎక్కువగా భావించి గతంలో తాను చైర్మన్ గా పనిచేసిన కేడిసిసి బ్యాంకును ఉన్నత స్థాయిలో నిలిపితే తనను విధుల నుంచి తప్పించి పెద్ద ఎత్తున అవినీతికి తెరలేపారని మరోసారి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 1962 వ సంవత్సరంలో మహానుభావులు పుచ్చలపల్లి సుందరయ్య గారు అధికారంలోకి వచ్చి ఉండుంటే గన్నవరం నియోజకవర్గం అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరి ఉండేదని అది జరగకపోవడం గన్నవరం ప్రజల దురదృష్టం అని తెలిపారు. అనంతరం గన్నవరం శాసనసభ్యులుగా వచ్చిన చాలా మంది నాయకులు చిన్న చిన్న పంచాయతీలలో సైతం ఏర్పాటు చేసి గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిలో తమ మార్కు చూపించారని ఎప్పుడూ కూడా మట్టి జోలికి వెళ్లలేదని కానీ గత పది సంవత్సరాలు గన్నవరం నియోజకవర్గం అంటే మట్టే అనే విధంగా భావించి పెద్ద ఎత్తున అక్రమాలకు తెర లేపరని అన్నారు. తాను రాజకీయ జీవితంలో ఎప్పుడూ రాజీ పడలేదని రాబోయే కాలంలో కూడా రాజీ పడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా తెలిపారు. ఎన్నికల ముందు తాను ప్రకటించిన సూపర్ సిక్స్ ను సాధించే క్రమంలో మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ మీద దృష్టి సారించి అశోక్ లేలాండ్ కంపెనీని వెనక్కి తీసుకు వచ్చినట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం, రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం దృష్టికి తెలిపానని, త్వరలోనే వాటిని ఏర్పాటు చేసి రైతులకు సౌలభ్యం కల్పిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్దే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నానని మరోసారి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం యొక్క ఆలయ పాలకవర్గం సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జాతీయ బిసి సంక్షేమ సంఘం లీగల్ సెల్ ఉపాధ్యక్షులుగా "గోకుల్" నర్సరీ మూర్తి





**రాజమహేంద్రవరం,మార్చి 26 (వార్తాప్రభ) :** జాతీయ బిసి సంక్షేమ సంఘంలో ప్రతిష్టాత్మకమైన లీగల్ సెల్ ఉపాధ్యక్షులుగా దండు బోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తిని నియమిస్తున్న ట్టుగా జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు వై.నాగేశ్వరావు, రాష్ట్ర ఇన్ ఛార్జ్ వై.నూకానమ్మ చేతులు మీదుగా మంగళవారం రాజమండ్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో "గోకుల్" నర్సరీ మూర్తి ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గోకుల్ నర్సరీ మూర్తి మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు ఆర్ .కృష్ణయ్య కి కృతజ్ఞతలు తెలియజేశారు. బిసిల హక్కుల కోసం,వారికి న్యాయం చేయుట గురించి నిబద్ధతతో పని చేసి,తనను నమ్మి ఇచ్చి పదవికి న్యాయం చేస్తానని అన్నారు. లీగల్ అంశాలు వచ్చినప్పుడు వెనుకబడిన వర్గాలు ఎక్కువగా నష్టపోతున్నాయని , ఇకపై తాము బీసీలకు అండదండలందిస్తామని మూర్తి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జనగణన నిష్పాక్షికంగా జరిగితే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఫార్ కార్నేర్ గా ఉన్న కొన్ని వెనుకబడిన వర్గాలను సైతం చైతన్యపరిచి సంఘంతో పయనించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వర రావు మాట్లాడుతూ గోకుల్ మూర్తికి శుభాకాంక్షలు అందజేశారు. ఏపీ బిసి ఎస్సి ఎస్టీ మైనారిటీ జేఏసీ లీగల్ అడ్వైజర్ గా సేవలందిస్తున్న గోకుల్ మూర్తి సేవలను బత్తుల కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎన్.బాబ్జి,లద్దిక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా వృత్తి పన్ను వసూళ్లు

- కార్పొరేషన్ పరిధిలో ఏప్రిల్ 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్ను వసూలు
- రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్



**విజయవాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** వృత్తి పన్ను వసూళ్లను సరళీకృతం చేసి మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని విజయవాడ 1, 2 డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్నుదారుల నుంచి పన్నుల వసూలును పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూళ్లను వాణిజ్య పన్నుల శాఖకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.63 జారీచేసిందని, ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. వివిధ వర్గాలకు చెందిన వేతన జీవులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు వారికి నిర్దేశించిన రేట్ల ప్రకారం వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. దుకాణ యజమానులు, రూ. 10 లక్షల కంటే అధిక వార్షిక టర్నోవర్ ఉన్న జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ. 15 వేల కంటే ఎక్కువ జీతం చెల్లిస్తున్న యజమానులు ఉద్యోగుల తరఫున ప్రభుత్వానికి వృత్తి పన్ను చెల్లించాలని ఆయన వివరించారు. 2025, మార్చి పన్ను కాలానికి (2025, ఏప్రిల్‌లో దాఖలు చేయాల్సిన) నెలవారీ ప్రొఫెషనల్ ట్యాక్స్ రిటర్న్‌ను https://myprofession-tax.apct.gov.in/ptax/ వెబ్‌సైట్లో లాగిన్ అయి దాఖలు చేయాలని జాయింట్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

# విజయవాడలో రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్

- ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు
- రాష్ట్రస్థాయి ఇఫ్తార్ కు రూ. 75 లక్షల ఖర్చు



**అమరావతి,మార్చి 26 (వార్తాప్రభ) :** విజయవాడలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని రాష్ట్రస్థాయి ఇఫ్తార్ నిర్వహణకు ప్రణాళికాబద్ధమైన, పటిష్టమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.బుధవారం ఇఫ్తార్ వేదిక ఏ ప్లస్ కన్వెన్షన్ వద్ద మైనారిటీ సంక్షేమ శాఖ సీఈఓ శ్రీధర్ , ఎన్టీఆర్ కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులతో రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ కు సంబంధించి ఏర్పాట్ల విషయంపై మంత్రి ఫరూక్ సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల స్థాయిలో ఇఫ్తార్ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని,ఇందుకోసం రూ.1.50 కోట్లు నిధులను విడుదల చేయడం కూడా జరిగిందని పేర్కొన్నారు.ఈనెల 27వ తేదీన గురువారం విజయవాడలో ఎంజీ రోడ్డులో ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఇఫ్తార్ ని అధికార యంత్రాంగం, అన్ని ముఖ్య శాఖల సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగి ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ కు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని మంత్రి ఫరూక్ వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా జిల్లా స్థాయి ఇఫ్తార్ ఏర్పాట్లు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఏర్పాట్లకు జిల్లాలకు నిధులను కేటాయించి విడుదల చేయడం జరిగిందన్నారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. ముస్లిం మైనార్టీల కు సంబంధించి గత ప్రభుత్వం నిలిపివేసిన ఇమాములు, మౌజన్ల గౌరవ వేతనంను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీలకు సంబంధించి కూడా పాస్టర్ల వేతనాలకు ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసిందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ తో పాటు అన్ని జిల్లాల్లో నిర్వహించే ఇఫ్తార్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉన్నత స్థాయి నుంచి క్షేత్రస్థాయిలోని సిబ్బంది వరకు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి ఫరూక్ సూచించారు

# అసంఘటిత కార్మికులకు కొండంత అండగా

- ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమా యోజన పథకం ● పండ్ల వర్తక సంఘ అధ్యక్షుడు గోకరకొండ బలరాం
- బాధిత కుటుంబానికి రెండు లక్షల పిఎంజెజెబివై చెక్కు అందించిన బలరాం, పోస్టల్ అధికారులు..



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** అసంఘటిత కార్మికులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కొండంత అండగా నిలుస్తుందని గుడివాడ పట్టణ పండ్ల వర్తక సంఘ అధ్యక్షుడు గోకర కొండ బలరాం పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇటీవల మరణించిన పండ్ల వర్తక సంఘ సభ్యురాలు పూడి బుజ్జి కుటుంబ సభ్యులకు, గుడివాడ పోస్టల్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు లక్షల పిఎంజెజెబివై చెక్కును పండ్లవర్తక సంఘ అధ్యక్షుడు బలరాం మరియు పోస్టల్ శాఖ అధికారులు బుధవారం ఉదయం అందచేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయనీ, పథకాన్ని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గుడివాడ పట్టణ పరిధిలోని పండ్ల వర్తక సంఘీయుల సంక్షేమానికి తాను అన్ని విధాలుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా బలరాం పేర్కొన్నారు. గుడివాడ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడివాడ పట్టణ పరిధిలోని పండ్ల వర్తక సంఘ సభ్యులందరికీ అధ్యక్షుడు బలరాం సొంత ఖర్చులతో ప్రతి సంవత్సరం యోజన పథకాన్ని కల్పించడం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యంగా ప్రజల శ్రేయస్సుకు పోస్టల్ శాఖ అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్రావు, ఐపిఓ బి.విజయ్, ఐపిపిబి మేనేజర్ గణేష్, గుడివాడ పండ్ల వర్తక సంఘ నాయకులు పెద్ది కిషోర్, అప్పన్న, నైనాల చిన్న, పిడుగు గోపి, వెంకటరమణ గుండు తదితరులు పాల్గొన్నారు.

# పేద వర్గాల నివాసిత ప్రాంతాల్లో.. వసతుల కల్పనకు ప్రతిపాదనలు..

- పబ్లిక్ హెల్త్ మరియు మున్సిపల్ అధికారులతో.. సమావేశమైన ఎమ్మెల్యే.. మౌలిక వసతుల కలపనకు రూ.86 కోట్లతో డిపిఆర్ లు సిద్ధం.. గుడివాడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు..



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణంలోని పేద, అల్పాదాయ వర్గాలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రూ.86 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ లోని తన స్వగృహంలో.. పబ్లిక్ హెల్త్ మరియు మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రూ.22.50 కోట్లతో తాగునీటి పంపిణీ నిర్వహణకు, పైప్లైన్లు మరియు నూతన ట్యాంకుల నిర్మాణ ప్రతిపాదనలు, రూ.10.90 కోట్లతో కనీస వసతుల కల్పనకు రూపొందించిన ప్రతిపాదనలు.. రూ.52.74 కోట్లతో పట్టణంలోని పెద్ద వీధి, కొత్తపేట, ముబారక్ సెంటర్, కొత్తపేట, బైపాస్ రోడ్డు, గుడ్ మాన్ పేట తదితర 13 కిలోమీటర్ల పరిధిలోనీ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, సీనరైజ్ మురుగు నీటి శుద్ధి (ఎంఎల్‌డి) ట్యాంక్ నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా రూపొందించిన అంచనాల ప్రతిపాదనలను.. గుడివాడ పట్టణ శాటిలైట్ మ్యాప్ నమూనా ద్వారా ఎమ్మెల్యే రాముకు వివరించారు. అభివృద్ధి పనులకు సిఐఎస్‌టి కన్సల్టెన్సీ సంస్థ రూపొందించిన డిపిఆర్ ను ఎమ్మెల్యే రాము పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ గుడివాడ రూప రేఖలు మార్చేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అధికారులు రూపొందించిన అంచనాల నిధులు సాధించేందుకు మున్సిపల్ మంత్రి నారాయణ, సంబంధిత శాఖల ఉన్నత అధికారులను కలుస్తానన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో.. ఎంపీ వల్లభనేని బాలసౌరీతో కలిసి అమృత 2.0నుండి నిధులు సాధించుకు వస్తానన్నారు. గుడివాడ అభివృద్ధికి తాను చేసే కృషికి ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించినప్పుడే సత్ఫలితం ఉంటుందని ఎమ్మెల్యే రాము అన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈ.ఈ. స్వామి నాయుడు, డి.ఈ పాండురంగ, మున్సిపల్ ఎం.ఈ. ఏ ఎస్ ఎన్ ప్రసాద్, సిఐఎస్‌టి కన్సల్టెన్సీ డైరెక్టర్ శాస్త్రి,పబ్లిక్ హెల్త్,మున్సిపల్ ఏ.ఈ. లు, సిఐఎస్‌టి కన్సల్టెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్డ్‌స్టోరేజ్‌లో భారీ అగ్నిప్రమాదం - రూ.15 కోట్ల విలువైన మిర్చి పంట దగ్ధం

- జగ్గయ్యపేటలోని సాయి తిరుమల మిర్చి కోల్డ్ స్టోరేజ్‌లో చెలరేగిన మంటలు - గిడ్డంగుల్లో మంటలు చెలరేగటంతో మిర్చి బస్తాలు దగ్ధం, నాలుగు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది..



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** జగ్గయ్యపేట పట్టణం తొర్రగుంటపాలెంలోని సాయి తిరుమల మిర్చి కోల్డ్ స్టోరేజ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న మిర్చి బస్తాలు దగ్ధమయ్యాయి. మిర్చి దగ్ధం కావడంతో ఒక్కసారిగా ఘాటైన వాసనలు ఆ ప్రాంతమంతా వ్యాపించాయి. అప్రమత్తమైన కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం రెండు అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలు ఆర్పుతున్నాయి.

**షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం :** శీతల గిడ్డంగి క్రింద బ్లాక్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతమంతా ఘాటైన వాసనలు వ్యాపించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఘటన స్థలాన్ని చేరుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రమాదంపై ఆరా తీశారు. తీసుకోవాల్సిన చర్యలపై నిర్వాహకులు అగ్నిమాపక అధికారులతో సమీక్షించారు. శీతల గిడ్డంగిలో 40 వేల మిర్చి బస్తాలు ఉన్నట్లు సమాచారం. వాటి విలువ దాదాపు 12 కోట్లు వరకు ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం గిడ్డంగిలో మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ప్రమాద ఘటన స్థలాన్ని నందిగామ ఆర్ డి ఓ బాలకృష్ణ పరిశీలించారు. వీలైనంత త్వరగా పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తామని గుడివాడ ఫైర్ ఆఫీసర్ జె. అంజనేయులు, ఏ.డి.ఎఫ్.ఓ వెల్లడించారు. మంటలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలపై అగ్నిమాపక పోలీస్ శాఖ అధికారులతో సమీక్షించారు. తాము కష్టపడి పండించిన పంట నష్టపోయామని రైతులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి మరీ పంటలు పండించామని, ఇప్పుడు తాము తీవ్రంగా నష్టపోయామని గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులందరూ విజ్ఞప్తి చేశారు.

# మాజీ మంత్రి కొడాలి నానికి గుండెపోటు?



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నాని గుండెపోటుకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి కొడాలి నాని గ్యాస్ట్రిక్ సమస్యతో ఆస్పత్రికి వెళ్లారు. అయితే వైద్య పరీక్షలు చేసిన తర్వాత ఆయనకు గుండెపోటు వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఆయనకు బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఆయన ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. కొడాలి నాని ఆరోగ్యం పట్ల వైసీపీ పార్టీ నేతలు, అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**అరెస్టు ప్రచారంతో ఒత్తిడిలో నాని.. !**

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ హయాంలో చంద్రబాబు, లోకేశ్, పవన్ లపై అసభ్య విమర్శలు చేసిన వారిని, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలను ఒక్కొక్కరిగా ప్రభుత్వం కేసుల పాలు చేస్తు అరెస్టులు చేస్తుంది. ఈ క్రమంలో తదుపరి కొడాలి నాని వంతు అన్న ప్రచారంతో ఆయన మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలై ఉండవచ్చని వైసీపీ శ్రేణులు భావిస్తున్నాయి. వైసీపీ పాలనలో జరిగిన అవకతవకలపై విచారణ పేరుతో ఇప్పటికే మాజీ మంత్రి పేర్ని నాని, అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌ను, గన్నవరం టీటీపీ ఆఫీస్ పై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని, చంద్రబాబు, పవన్ లపై అసభ్యకర విమర్శల కేసుల్లో పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేశారు. తాజాగా మాజీ మంత్రి విడుదల రజనీపై స్టోన్ క్రషర్ యజమానులను బెదిరించారన్న అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ కూడా కూటమి సర్కార్ టార్గెట్ లో ఉన్నారని..ఆయనపై కూడా త్వరలోనే కేసులు నమోదవుతాయన్న ప్రచారం సాగుతోంది. అయితే కూటమి ప్రభుత్వం టార్గెట్ లిస్టులో కొడాలి నాని ప్రధానంగా ఉన్నారని.. ఆయన అరెస్టు టార్గెట్ గా పావులు కదుపుతుందన్న టాక్ పొలిటికల్ సర్కిల్ టో కొంతకాలంగా వినిపిస్తుంది. ఈ నేపథ్యంలోనే పోలీసులను అవమానించేలా, వారి ఆత్మ స్థైర్యం దెబ్బతినేలా మాట్లాడారంటూ మచిలీపట్నంలో నాని మీద నమోదైన ఓ పాత కేసును ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. దీంతో ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం నాని హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుతో పాటు పలు ఇతర వివాదాలకు సంబంధించిన కేసులు ఫైల్ చేసి కొడాలి నానిని అరెస్టు చేస్తారన్న ప్రచారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన ఒత్తిడికి గురై ఉంటారని వైసీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

# దైవజనులు పగడాల ప్రవీణ్ మృతిపై సీబీఐ దర్యాప్తు చేయించాలి: పాస్టర్ రూబెన్




**విజయవాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** దైవజనులు పగడాల ప్రవీణ్ మృతిపై క్రైస్తవ సమాజానికి అనేక అనుమానాలు ఉన్నాయని ఈ అనుమానాలన్నిటిని ప్రభుత్వమే నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివృత్తి చేయాలని బ్లెస్సింగ్ టెంపుల్ పాస్టర్ రూబేన్ అన్నారు. బుధవారం సాయంత్రం క్రైస్తవ సోదరులతో కలిసి విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద నుండి పడమలరేవు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా వామ పక్ష పార్టీ నాయకులతో పాటు ఐ ఎఫ్ టీ యూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తన యొక్క సంఘీభావాన్ని తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రైస్తవ సమాజం కొరకు తన యొక్క గలాన్ని సోషల్ మీడియా మరియు మీడియా వేదికగా నిరంతరం ప్రశ్నిస్తున్న దైవజనులు పగడాల ప్రవీణ్ నిన్న తెల్లవారుజామున అకస్మికంగా రాజమండ్రి నుండి రాజానగరం వెళుండగా జరిగిన ప్రమాదంపై దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి దూషన్ని కట్నంగా శిక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ కూడా ఇప్పటికే ఘటనపై స్పందించి పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడాన్ని హర్షిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను శిక్షించేంతవరకు క్రైస్తవ సమాజం నిరసనలు తెలియజేస్తూ ఉంటుందని పేర్కొన్నారు. మీడియా వేదికగా ఆయనను చంపేస్తామని కొన్ని వర్గాల కు చెందిన నాయకులు గత కొన్ని రోజులుగా ఆయనకు హెచ్చరికలు పంపిస్తున్నారని తెలిపారు. పోలీసులు ప్రాథమిక విచారణలో రోడ్డు ప్రమాదం అని చెప్పడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబిఐ తో దర్యాప్తు చేయించి నిజ నిజాలు వెలుగులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీరావలి, బెజవాడ సాయి ఎల్విన్ బర్ణభాస్, రామకృష్ణ, రాజు, కిరణ్, మోసేస్, అశోక్ బ్రౌంటీ, కిరణ్, సంతోష్, శ్యామల మరియు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# మండల లీగల్‌సెల్, గుడివాడ వారి ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు..

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ జ్యుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి పి. గాయత్రి





**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఉత్తర్వుల ప్రకారం బుధవారం స్థానిక గుత్తా రామకృష్ణయ్య టౌన్ హైస్కూల్ నందు మండల న్యాయ సేవాధికార కమిటీ -గుడివాడ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జ్యుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్రేట్ శ్రీమతి పి. గాయత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ గాయత్రి గారు విద్యార్థినీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. బాలికల మీద జరుగుతున్న అకృత్యాలు, అఘాయిత్యాలు, ఆకతాయిల వేధింపులు, లైంగిక వేధింపుల మీద విద్యార్థులకు అవగాహన కల్గించారు. ఎవరి మాయమాటలు నమ్మి ఎవరికి ఫోన్ నెంబర్లు ఇవ్వరాదని, ఎటువంటి ఫోన్ ఛాట్‌లు చేయకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా వారు ఇచ్చిన బహుమతులకు లొంగి తల్లిదండ్రులకు తెలియకుండా ఎక్కడకు వెళ్ళరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 1టౌన్ పోలీసులు, శక్తి టిమ్ సభ్యులు, పారా లీగల్ బాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనా పద్ధతులు మరియు మేధో సంపత్తిపై అవగాహన సదస్సు



**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** శాస్త్రీయ పరిశోధనకు సాహిత్య సమీక్ష, శీర్షిక సముచితమైన రీతిలో వుండాలని డిల్లి బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ కె. త్రివేణి కుమారి సోధహరణముగా వివరించారు. స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాలలో పరిశోధనా పద్ధతి మరియు మేధోసంపత్తి హక్కులు మీద జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి పరిశోధన అనేది చాలా ముఖ్యమైన అంశమని మరియు పరిశోధన శాస్త్రీయంగా ఎలా చెయ్యాలో దానిలోవున్న అంశాలను ఉదాహరణలతో విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, కళాశాల ప్రెసిడెంట్ శ్రీ ఎల్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ శ్రీ కె.ఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి బి.ఎస్.ఎస్. పద్మజ, ఎం.బి.ఎ. డిపార్టుమెంటు విభాగాధిపతి శ్రీమతి డాక్టర్ ఎం.బి.సువర్చల, అధ్యాపకులు, మరియు పి.జి. విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# రేపు గంగానమ్మ గ్రామోత్సవం ప్రారంభం



**కోడూరు, మార్చి 26 (వార్తాప్రభ) :** కోడూరు గ్రామంలో కొలిచిన వారికి కొంగుబంగారమై భక్తుల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి గ్రామోత్సవం గురువారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధర రావు తెలిపారు. 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు కోడూరు స్వతంత్ర పురం, దింటిమిరక, వేటపాలెం, నరసింహపురం, ఇస్మాయిల్ బేగ్ పేట, యర్రా రెడ్డిపాలెం గ్రామాలలో అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. కావున ఆయా గ్రామాలలో అమ్మవారు తిరుగు వీధులలో భక్తులు అమ్మవారి వాహనానికి ఇబ్బంది లేకుండా స్వచ్ఛందంగా చెట్లు కొమ్మలను తొలగించాలన్నారు. ఆయా గ్రామ పెద్దలు ముందుగా కమిటీ వారిని ,పోలీసు వారిని సంప్రదించాలని, గ్రామోత్సవంలో డీజే లకు అనుమతి లేదని తెలిపారు. 31 న ఆలయ ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు యుగంధర్ తెలిపారు.

# చిన్న పాండ్రాక, లక్ష్మీపురం పిహెచ్సి లకు ఆక్సిజన్ కన్సన్ట్రేటర్ల అందజేత



**కృత్తివెన్ను,మార్చి 26 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నియోజకవర్గ పరిధిలో నీ కృత్తివెన్ను మండలం చిన్న పాండ్రాక గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు మరియు లక్ష్మీపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు రూ 90,000/- విలువైన ఆక్సిజన్ కన్సన్ట్రేటర్లను ఆసుపత్రి వైద్యులు సూర్యతేజ్ మరియు సాయి సందీప్ లకు అందజేశారు ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య వైద్యం అందించడం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉన్న రోగులకు ఈ ఆక్సిజన్ కన్సన్ట్రేటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు మెడికల్ ఆఫీసర్లు మరియు వారి సిబ్బంది గౌరవ ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది సూపర్వైజర్లు కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ పంచాయితీ కార్యాలయం - గడ్డమణుగు జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

### టెండరు ప్రకటన

తేది. 27.03.2025.

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, గడ్డమణుగు గ్రామ పంచాయితీ నందు ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను (2025-2026 ఆర్థిక సంవత్సరంనకు) అనగా ది.01-04-2025 నుండి 31-03-2026 వరకు షెడ్యూల్‌లో చూపించిన ప్రకారం పనులు చేయుటకు గాను ది. 29-03-2025 వ తేది ఉదయం 12.00 గంటలకు సీల్డు టెండర్లు సదరు గ్రామ పంచాయితీ కార్యాలయములో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారు స్వీకరించబడును. టెండర్ దాఖలు చేయువారు నిర్ణీత టెండర్లు రుసుము చెల్లించి టెండర్లు దాఖలు చేయవలెను. అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికి హాజరైన టెండర్ దారుల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరువబడును. టెండర్ షరతులు, ఇతర వివరాలకు పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల యందు పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకోవచ్చును.

| వ. సంఖ్య | పని పేరు | కాలము | టెండరు ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య నిర్వహణ - 3 | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.3x500/- = 1500/- |
| 2) | మంచినీటి సరఫరా - 1 | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1x500/- = 500/- |
| 3) | వీధి దీపముల రిపేరు - 2 | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.2x500/- = 1000/- |

**గమనిక :**
1. గతంలో పని చేసిన వారికి ముందుగా ప్రాధాన్యం ఇవ్వబడును.
2. గ్రామ పంచాయితీ నిధులు నిల్వలను బట్టి పేమెంట్ చేయబడును.

**సం/- ప్రత్తిపాటి రవీంద్ర కుమార్**
**సర్పంచ్**
**గ్రామ పంచాయతీ, గడ్డమణుగు**
**జి.కొండూరు మండలం.**

**సం/- కొమరగిరి పులి గంగాధరరావు**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయతీ, గడ్డమణుగు**
**జి.కొండూరు మండలం.**

## బొర్రగూడెం శ్రీ తిరుపతమ్మ గోపయ్య వార్ల దేవస్థానము హుండీ లెక్కింపు

● ఆలయానికి రూ.3,04,959 లు సమకూరిన ఆదాయం

**మైలవరం,మార్చి 26 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలంలోని చంద్రగూడెం గ్రామ శివారు బొర్రగూడెం గ్రామము నందు వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ గోపయ్య వార్ల దేవస్థానం హుండీలలోని కానులను బుధవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వాహన అధికారి తేజ ప్రకటనలో తెలిపారు.మర్చి 26 వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారు లు ,భక్తులు, గ్రామస్తుల సమక్షములో హుండీలలో ని కానుకలను 4 నెలల 26 రోజుల తర్వాత తెరచి లెక్కించడం జరిగిందని వెల్లడించారు.మొత్తం రూ.3,04,959 లు ఆలయానికి ఆదాయం సమకూరిందని ఆలయం ఈవో తేజ పేర్కొన్నారు.
**బహిరంగవేలము:** దేవస్థానమునకు చెందిన దేవస్థానము సత్రము నందు వంటపాత్రలు, గ్యాస్ పొయ్యిలు అద్దెకిచ్చే లైసన్స్ హక్కనకునూ, తలనీలాలు ప్రోగుచేసికునే లైసెన్స్ హక్కునకునూ వాహనముల పార్కింగ్ ప్లేస్ లైసెన్స్ హక్కనకు ఒక సంవత్సరకాలమునకు ది 26.03.2025 తేది బుధవారం మధ్యాహ్నం 2:00 గంటల నుండి స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, భక్తుల సమక్షంలో దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో టెండర్ కం బహిరంగవేలము నిర్వహించగా రూ. 3,08,000 లు వచ్చినవని ఈవో తేజ తెలిపారు.

## నేడు కట్టుబడిపాలెం ఉపసర్పంచ్ ఎన్నిక

**జి.కొండూరు,మార్చి 26 (వార్తాప్రభ) :** మండలంలోని కట్టుబడిపాలెం గ్రామ ఉపసర్పంచ్ ఎన్నిక నేడు గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు.ఇప్పటి వరకు ఉపసర్పంచ్ గా ఉన్న రామావతు కృష్ణవేణి రాజీనామ చేశారని,ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్ పదవికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యిందని తెలిపారు. మర్చి 27 వ తేదీ ఉదయం11.00 గంటలకు సాధారణ ఎన్నిక నిర్వహించబడునని తెలిపారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా మండల విస్తరణ అధికారి (పిఓపిఆర్ అండ్ ఆర్ డి ) శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలియజేశారు.

## బాలల హక్కులపై చైతన్య సదస్సులు

● వి.సి.ని కోరిన నల్లాని రాజేశ్వరి



**అనంతపురము,మార్చి 26 (వార్తాప్రభ) :** రేపటి పౌరులైన నేటి బాలల సమగ్రాభివృద్ధి దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమని ప్రముఖ సామాజిక కార్యకర్త, భారత ప్రభుత్వ "రాజ్యమహిళా సమ్మాన్" అవార్డు గ్రహీత, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ చైర్ పర్సన్ నల్లాని రాజేశ్వరి అన్నారు. బాలల హక్కులు - చట్టాలపై విద్యార్థులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు బుధవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఇన్చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ అనితను కలిసి విజ్ఞప్తి చేశారు. విసితో పాటు రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, పరీక్షల విభాగం సంచాలకులు, సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.వి. రమణ లతో కలిసి చర్చించారు. బాలల హక్కుల రక్షణకు సంబంధించి భారతదేశంలో కొన్ని ముఖ్యమైన చట్టాలు ఉన్నాయన్నారు. జువెనైల్ జస్టిస్ (సంరక్షణ మరియు రక్షణ) చట్టం (2000, 2015లో సవరించారు), బాల్య వివాహ నిషేధ చట్టం (2006), లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (2012), బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం (1986) ఉన్నాయన్నారు. ముఖ్యంగా జువెనైల్ జస్టిస్ (సంరక్షణ మరియు రక్షణ) చట్టం (2000, 2015లో సవరించారు) గురించి వివరించారు. ఈ చట్టం బాలల సంక్షేమం, రక్షణ, పునరుద్ధరణకు సంబంధించిన అంశాలను కలిగి ఉందన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం (2006) ఎంతో కీలకమైందన్నారు. ఈ చట్టం బాల్య వివాహాలను నిషేధించి, వాటిని పూర్తిగా నివారించేందుకు తగిన చర్యలు తీసుకుందన్నారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (2012) బ్రహ్మాస్త్రం వంటిదన్నారు. లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించడానికీ, బాధితులకు సహాయం అందించడానికీ, నేరస్థులకు శిక్ష విధించడానికీ రూపొందించారని చెప్పారు. బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం (1986) బాలల శ్రమను నిషేధించి, బాల కార్మికులకు రక్షణ కల్పించిందన్నారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయం,కోకనారాయణపాలెం

### టెండరు ప్రకటన

తేది. 03.02.2025.

కృష్ణాజిల్లా,గూడూరు మండలం, కోకనారాయణపాలెం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2025 నుండి 31.03.2026 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు ది.30.03.2025 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంక్ ఆపరేటర్‌గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.3500/- |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.4000/- |
| 3) | స్వీపర్‌గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.3000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- బండి అంజలి కుమారి**
**సర్పంచ్**
**కోకనారాయణపాలెం గ్రామ పంచాయితీ**

**సం/- పి.వి.రవి కిరణ్**
**కార్యదర్శి**
**కోకనారాయణపాలెం గ్రామ పంచాయితీ**

## కాలంకారి పరికరాలు పంపిణీ చేసిన ఎమ్ఎల్ఎ కాగిత





**పెడన,మార్చి 26 (వార్తాప్రభ) :** గూడూరు మండలం పోలవరం గ్రామం లో కాలంకారి క్లస్టర్ డెవలప్మెంట్ లో భాగంగా హెచ్ సి ఎల్ ఫౌండేషన్ వాసవ్య మహిళా మండలి వారి ఆధ్వర్యంలో కాలంకారి వారికీ ప్రొటక్షన్ షూఎప్రాన్ హ్యాండ్ బ్లాక్ టేబుల్ లాంగ్ టేబుల్ ఫాబ్రిక్ కప్పులదొడ్డి ఆకులమాన్నాడు పోలవరం గ్రామ పంచాయతీ లకు చెత్త సేకరణ రిక్షాలు ఎమ్ ఎల్ ఎ కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమం లో హెచ్ సి ఎల్ వాసవ్య మహిళా మండలి వారు, ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ వెంకటరావు, హ్యాండ్లూమ్ డివో రాజు తహసీల్దార్ డి రాజ్య లక్ష్మి స్నేహిత కాలంకారి సభ్యులు మూడు పంచాయతీ సర్పంచులు పోలవరం స్కూల్ హెచ్ ఏం మాజీ ఎంపీపీ కాస గాని శ్రీనివారావు, గూడూరు మాజీ సర్పంచ్ అన్నం హ రి రామ కృష్ణ పోలవరం మాజీ సర్పంచి శ్రీనివాస్ మహేష్ బల్ల సాయి తెలుగుదేశం కూటమి పార్టీ నాయకులు కలంకారీ కళాకారులూ పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన కృష్ణ ప్రసాద్ హెచ్ సి ఎల్ ఫౌండేషన్ వారికి స్నేహిత కలంకారీ తరపున మాజీ సర్పంచ్కారుపర్తి శ్రీనివాస్ కలంకారీ మెమంటో లు అందచేయటం జరిగింది

## ఇంతేరులో ప్రభుత్వ భూముల అక్రమ విక్రయాలు



**కృత్తివెన్ను,మార్చి 26 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో ప్రభుత్వ బంజర భూములను అక్రమంగా విక్రయించటం కలకలం రేపింది ఇంతేరు గ్రామానికి చెందిన పెదసింగు పాండురంగారావు అనే ఒక దళారి మడ అడవులకు చెందిన ప్రభుత్వ భూములను తన సొంత భూమిగా చూపించి విక్రయిస్తున్న వార్త సంచలనం రేపింది గత రెండు సంవత్సరాలుగా ఇతనిపై ఇదే తరహాలో కేసులు నమోదైనప్పటికీ ఇతనిలో మార్పు రాకపోవడం శోచనీయం బడా బాబుల అండదండలు లేకుండా అతను ఈ దుర్మార్గానికి ఒడికట్టడు అని గ్రామస్తుల ఆవేదన స్థలాన్ని అక్రమంగా కొనుక్కున్న వ్యక్తులు గ్రామంలోకి వచ్చి కొలతలు కొలుస్తుండడంతో గ్రామస్తులంతా ఏకమై వారిని నిలదీయగా ఆ గ్రామ ప్రెసిడెంట్ తమ్ముణ్ణి అని చెప్పుకునే ఈ దళారి పాండురంగారావు చేసిన పనే అని... ఇతను ఇక మారడు అంటూ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటే కానీ ఇటువంటి దళారులకు ఒక గుణపాఠం కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు విషయాన్ని తెలుసుకుని పరిశీలించిన రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు నచ్చ చెప్పి అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేసు ఇప్పటికే నమోదు చేశామని తెలిపారు ప్రభుత్వ భూములను అన్యాక్రాంతంగా అక్రమ పద్ధతిలో విక్రయించటం నేరమని గుర్తుచేసి ఇటువంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులను ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని వారు తెలిపారు

## పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆకస్మిక మృతి పై తీవ్ర అనుమానాలు..

● క్రైస్తవ లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన పాస్టర్ ప్రవీణ్ మరణం..! ● పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మరణం పై లోతైన విచారణ జరగాలి



**విజయవాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆకస్మిక మరియు అనుమానాస్పద మరణం యావత్ క్రైస్తవ లోకాన్ని దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసింది. ఆయన దేవునికి అంకితభావంతో కూడిన సేవకుడు. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతదేహం వద్ద ఆయన మోటార్ సైకిల్ లభ్యమైంది, రోడ్డు ప్రమాదం జరిగినట్లు స్పష్టమైన సంకేతాలు లేవు. ఇది ఆయన కుటుంబం మరియు క్రైస్తవ లోకానికి హత్య అనుమానాలను రేకెత్తించింది. సమగ్ర దర్యాప్తు కోరుతూ ఆయన బంధువులు మరియు క్రైస్తవ సంఘాలు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ముఖ్యంగా, పాస్టర్ పగడాల ఒక నెల క్రితం సోషల్ మీడియా పోస్ట్‌లో తన ప్రాణాలకు ముప్పు ఉందని భయాలను వ్యక్తం చేశారు. ఈ సంఘటన భారతదేశంలో అనేక ప్రాంతంలలో ఉన్న క్రైస్తవుల భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది, నిష్పాక్షికంగా మరియు త్వరితగతిన దర్యాప్తు జరపాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ పిలుపునిచ్చింది. పాస్టర్ పగడాల ప్రముఖ టీవీలో ప్రసిద్ధ బోధకుడు, ఇది కేసు యొక్క ప్రాముఖ్యతను పెంచింది. అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు గెర హనోక్ అనుమానాస్పద మరణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పాస్టర్ బెన్హమ్, పాస్టర్ జోన, సిటీ ప్రెసిడెంట్ ప్రభుదాస్, రాష్ట్ర కార్యదర్శి డానియల్ బోస్, పొలిటికల్ వింగ్ మద్దిరాల కమలాకర్ రావు, లీగల్ సెల్ బాబురావు, సతీష్, నెహెమ్యా, అజయ్, డానియల్ బాబు, అబ్రహం, డేవిడ్ రాజు, పాల్ రాజ్, మనోహర్, ఏసుదాస్, సిస్టర్ గ్రేస్ మరియు ఏఐసీసీ టీం పాల్గొన్నారు.

## క్రైస్తవ ఆణిముత్యం పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవ్యానికి తీరని లోటు

● ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్.జి.శ్యాంబాబు





**గుడివాడ,మార్చి 26 (వార్తాప్రభ) :** టిడ్కో కాలనీలో జరుగుతున్న క్రైస్తవ మహ సభలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ పాస్టర్స్ అత్యవసర సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో ప్రముఖ దైవజనులు క్రైస్తవులకు ప్రతి విషయంలో అండగా నిలబడి సత్యాన్ని ఉన్నది ఉన్నట్టు గా ప్రకటించిన క్రైస్తవ ఆణిముత్యం పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవ్యానికి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్.జి.శ్యాంబాబు అన్నారు. క్రైస్తవ సభలకు వెళుతూ రాజమండ్రి దగ్గర ప్రమాదవశాత్తు మరణించారని తెలపడం క్రైస్తవులు జీర్ణించుకోలేక పోతున్నారు.దైవజనులు పగడాల ప్రవీణ్ యొక్క మరణం మీద అనేకమైనటువంటి అనుమానాలు ఉన్నాయని,ఈ అనుమానాలకు సంబంధించి క్రైస్తవ పెద్దలు ఎంతగానో పోరాడుతున్నారు. ఈవిషయమై సరైనటువంటి న్యాయం జరగకపోతే అనేక విధాలుగా క్రైస్తవ సహోదరి సహోదరులు, క్రైస్తవ సంఘాలు, నాయకులు అందరూ కూడా సంబంధిత అధికారుల ఆఫీసులను ముట్టడిస్తారని, శాంతియుత ర్యాలీలు చేపడతారని తెలియజేశారు. అన్ని జిల్లాలు,అన్ని మండలాలలో కూడా క్రైస్తవ దైవసేవకులు అందరు కూడా ఈ విషయం మీద స్పందించి ప్రవీణ్ పగడాలకి న్యాయం జరగాలని, అంతేగాకుండా క్రైస్తవుల మీద జరుగుతున్నటువంటి అన్యాయాలను, దాడులను ప్రభుత్వం అరికట్టాలన్నారు. భారత దేశములో ఉన్నటువంటి హిందూ, ముస్లిం, క్రైస్తవులందరు కూడా సహోదరులుగా ఉండాలని బిషప్ జి.శ్యాంబాబు తెలిపారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ డివిజన్ పాస్టర్స్ బి.సునీల్ కుమార్,జి.యేహెజ్కేలు,సత్యం,ఏలీషా,ప్రసన్న కుమార్, నాగభూషణం, స్టీఫెన్,సువార్త రాజు గుడ్లవల్లేరు దైవ సేవకులు పాల్గొని వారి కుటుంబ శాంతి కొరకు ప్రార్ధనలు చేసారు.

## కృత్తివెన్ను మండలం, గ్రామ చినగొల్లపాలెం తీరప్రాంత రక్షణకు త్వరలో చర్యలు - ఎంపి బాలశౌరి




**కృత్తివెన్ను,మార్చి 26 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలానికి చెందిన చిన గొల్లపాలెం, ఆంధ్రప్రదేశ్‌లోని ఒక తీరప్రాంత గ్రామం. సముద్రపు అలల ఉద్ధృతికి భూమి కోల్పోతున్నందున గ్రామ-స్థులకు మరియు సాగు భూములకు ఇక్కడ తీవ్రమైన నష్టం జరుగుతోంది. ఇక్కడ ఉప్పెనల ఉద్ధృతి పెరగడం, అలలు భూమిని క్రమంగా దుమ్ము చేయడం, కలుషిత నీటి ప్రవాహాలు సముద్రతీరాన్ని నెమ్మదిగా దెబ్బతీయటం, వాతావరణ మార్పులతో సముద్ర స్థాయి పెరగడం, అతిగా ఇసుక తవ్వకాలు తీరప్రాంత భూమిని బలహీనం కావడం, మ్యాంగ్రోవ్ అడవుల నాశనం వలన ప్రకృతిసిద్ధమైన రక్షణ కోల్పోవడం, పట్టణీకరణ, నిర్మాణ పనులు, తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు పెరగడం వల్ల భూగర్భ మార్పులు జరగడం, సముద్రపు అలల ధాటికి భూమి కొట్టుకుపోయి, క్రమంగా గ్రామం మునిగిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా నది, సముద్రపు నీరు భూముల్లోకి చొచ్చుకుపోవడం వల్ల వ్యవసాయ భూములు ఉప్పు నేలగా మారుతున్నాయి. జీవనోపాధిపై ప్రభావం చూపిస్తోంది. మత్స్యకారుల జీవనాధారం దెబ్బతింటోంది, వేటకారులు తమ ప్రదేశాలను వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందుకు & పరిష్కార మార్గాలు ఏమిటంటే :: రక్షణ గోడల నిర్మాణం: సముద్రపు అలలను అడ్డుకునేందుకు రక్షణ గోడలు బ్రేక్ వాటర్ స్ట్రక్చర్స్ నిర్మించడం. మడ అడవుల పరిరక్షణ: ప్రకృతిసిద్ధంగా సము-ద్రపు అలలను అడ్డుకునేందు కు మ్యాంగ్రోవ్ మొక్కలను పెంచడం ఇసుక తవ్వకాలను నియంత్రణ: అక్రమ ఇసుక తవ్వకాలను కఠినంగా నిరోధించడం తీరప్రాంత సంరక్షణ ప్రణాళికలు: సైన్సటిఫిక్ కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు రూపొందించి, టెక్నాలజీ సహాయంతో సముద్రపు అలలను అరికట్టడం ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు: తీరప్రాంత గ్రామాలను తరలించేందు కు పునరావాస కార్యక్రమాలు చేపట్టడం, రైతులకు నష్టపరిహారం అంది ంచడం వంటి పనులు జరగాల్సి ఉంది. ఇందుకోసం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ వల్లభనేని బాలశౌరి బుధవారం నాడు ఢిల్లీ లోని నేషనల్ డిశాస్టర్ మేనేజుమెంట్ అథారిటీ మెంబర్ మరియు హెడ్ అఫ్ డిపార్ట్మెంట్ శ్రీ రాజేంద్ర సింగ్ ను కలిసి కృత్తివెన్ను మండలంలోని చిన గొల్లపాలెంలో సముద్రపు అలల వలన క్రమంగా క్షీణిస్తున్న భూమి గురించి, అందుకు తీసుకొనవలసిన రక్షణ చర్యల గురించి మాట్లాడారు ఎంపి బాలశౌరి వినతికి సానుకూలంగా స్పందించి వెంటనే తగు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన యెడల, నిధులు మంజూరు చేసి చర్యలు తీసుకొంటామని తెలియ పరిచారు.

## ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశాలు....



**పెనుగంచిప్రోలు,మార్చి 26 (వార్తాప్రభ) :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనుల్లో అవకతవకలు, సిబ్బంది రికార్డుల నిర్వహణ లోపం సామాజిక తనిఖీ వేదిక ద్వారా వెలుగులోకి వచ్చాయి. మండలపరిషత్ కార్యాలయం వద్ద బుధవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఉపాధి హామీ పీడి రాము ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందం 2023-24లో జాతీయ ఉపాధి హామీ పథకం,లో జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తనిఖీ చేశారు. ఉపాధిహామీ పనుల్లో జరిగిన అక్రమాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారులకు చదివి వినిపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ నిర్వహణ సక్రమంగా నిర్వహించలేదని అన్నారు. కూలీల సంత కాలు లేకుండానే నగదు ఇచ్చారని సామాజిక తనిఖీ బృందం గుర్తిం చింది. అనిగండ్లపాడు గ్రామంలో పని చేయని కూలీలకు పని చేసినట్లు హాజరు వేసి వేతనాలు ఇచ్చినట్లు గుర్తించారు. పంట కాలువ కొలతల్లో భారీగా తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలోఎం పి డి వో జి.శ్రీను, ఏపీడీ పార్థసారథి ఎంపీపీ మార్కపుడి గాంధీ, జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## టి జె పి యస్ కళాశాల విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్ మెంట్లో ఉద్యోగాలు




**గుంటూరు, మార్చి 26 (వార్తాప్రభ) :** స్థానిక టి జె పి యస్ కళాశాల కెరీర్ గైడన్స్ & ప్లేసెమెంట్ విభాగం వారి ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఈరోజు క్యాంపస్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి పేర్కొన్నారు. ఈ జాబ్ డ్రైవ్ లో డిగ్రీ, పి. జి చదివిన విద్యార్థులు పాల్గొన్నారు.జెన్పాక్ట్, క్విస్ క్రాప్, యాక్రో సాఫ్ట్ సొల్యూషన్స్, హెచ్ డి బి ఫైనాన్స్ సర్వీసెస్, ఐ ప్రాసెస్, బ్లూ స్టార్, మదర్ సన్ సుమీ సిస్టం లిమిట్, ముతూట్ ఫైనాన్స్,విజేత సూపర్ మార్కెట్ వంటి వివిధ కంపెనీ లు వచ్చాయి. ముందుగా విద్యార్థులకు రిటర్న్ టెస్ట్ నిర్వహించి, తరువాత మౌఖిక పరీక్షలు జరిపారు. ఈ డ్రైవ్ లో 280 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన 117 మంది విద్యార్థులకు మందికి కళాశాల సెక్రటరీ & మరియు కరెస్పాండంట్ కె వి బ్రహ్మం చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో మ్యాజిక్ బస్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమ మేనేజర్ సిహెచ్ మోహన్ ఆర్ పుష్పలత్, కళాశాల ప్లేస్ మెంట్ అధికారి సి హెచ్ చంద్ర శేఖర్, సభ్యులు జి. సురేష్ కుమార్, ఆర్ స్వామి, వై మార్కొండయులు, బి. శ్రీనివాసరావు గారు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## రబీ సీజన్లో ధాన్యం సేకరణకు సర్వ సన్నద్ధం కావాలి: జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి



**అమలాపురం,మార్చి 26 (వార్తాప్రభ) :** కోనసీమ జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్లో ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి లైన్ డిపార్ట్మెంట్ అధికారులను, మిల్లర్లను కోరారు. కలెక్టరేట్ నందు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో రబీ సీజన్లో ధాన్యం సేకరణ ప్రక్రియ సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని ఆదేవిధంగా రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట ప్రణాళికతో సన్నద్ధంగా వుండాలని అధికారులను ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంకు గ్యారంటీలు,రెన్యువల్, బఫర్ గోదాముల వినియోగం,తేమ తూనికల పరికరాలు, గోనెసంచులు,రవాణా లేబరు టెక్నికల్ అసిస్టెంట్స్, వివిఏ జిపిఎస్ కోఆర్డినేట్స్ తో వాహనాల మూమెంట్ కొరకు కస్టోడియన్ అధికారులుగా సమర్థులను నియమాకం,మిల్లర్ల ఎకనాలెడ్జ్మెంట్, ట్రక్ సీటు, జనరేషన్ ఎఫ్ టి ఓ జనరేషన్ కాగిత రహిత డిజిటల్ లావాదేవీలు ఇత్యాది అంశాలపై సమీక్షించారు. ఆదేవిధంగా రబీకి కూడా సిద్ధంగా వుండాలన్నారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఆధారంగా చూస్తే రబీలో 1,64,854 ఎకరాలలో వరి పంట సాగు చేయడం జరిగిందని, 6,17,000 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అధికారులను అదేశించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188